కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :193 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | ఆదివారం 22-11-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

సవాళ్లు ఎదుర్కోకుండా నేను బతకలేను..



ఖరగ్‌పూర్: సవాళ్లను ఎదుర్కోకుండా తాను జీవించలేనని, సంకుచిత భావజాలాన్ని వీడినప్పుడే వ్యక్తులతో పాటు దేశం పురోగమిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ మిడ్నాపూర్ జిల్లా ఐఐటీ ఖరగ్‌పూర్ స్థాపనం జూబ్లీ వేడుకల్లో శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని నిలబడటాన్ని నేర్చుకోకపోతే అనుకున్న ప్రగతిని ఎప్పటికీ సాధించలేమని యువతకు సూచించారు. దేశ ప్రగతిని అడ్డుకునే అతిపెద్ద అవరోధం మనసులోని పరిమితులేనని, గత కొన్నేళ్లుగా భారత్ ఆ అడ్డంకులను అధిగమించి ఎంతో ముందుకు సాగిందని స్పష్టం చేశారు.ఒకప్పుడు దేశంలో పేదరికాన్ని మార్చలేని శాపంగా భావించే వారని, భారత్ దాని నుంచి ఎప్పటికీ బయటపడలేదన్న అభిప్రాయం ఉండేదని ప్రధాని గుర్తుచేశారు. గతంలో ఎవరూ ఆ సమస్యను పరిష్కరించే సాహసం చేయలేదన్నారు. కానీ తాము అధికారంలోకి వచ్చాక నిరుపేదల ఆత్మగౌరవం కోసం మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రాధాన్యతనిచ్చామని చెప్పారు.ఫలితంగా దేశంలో దాదాపు 50 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చినట్లు ప్రపంచ బ్యాంకు నివేదిక స్వయంగా ధ్రువీకరించిందని తెలిపారు. గత 75 ఏళ్ల కాలంలో భారత్ ఎడ్లబండ్ల స్థాయి నుంచి బుల్లెట్ రైళ్ల దిశగా వేగంగా ఎదిగిందని, ఈ చారిత్రక మార్పులకు ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రత్యక్ష సాక్షిగా నిలిచిందని పేర్కొన్నారు.అంతరిక్ష పరిశోధన రంగంలోనూ సరికొత్త మార్పులు తెచ్చామని మోదీ వివరించారు. గతంలో ఇస్రోలోకి ప్రతిభావంతులైన యువత ప్రవేశంపై అనేక ఆంక్షలు ఉండేవని, వాటిని తొలగించి అర్హులైన యువ నిపుణులకు తలుపులు తెరిచామని వెల్లడించారు. అందుకే నేడు భారత అంతరిక్ష విజయాలను ప్రపంచం మొత్తం గుర్తిస్తోందన్నారు. సెమికండక్టర్ల రంగంలో ఐదు దశాబ్దాల క్రితం అవకాశాన్ని చేజార్చుకున్నప్పటికీ, తాము పట్టుదలతో నాలుగేళ్లలోనే భారీ సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంలో ఐఐటీ ఖరగ్‌పూర్ కీలక పాత్ర పోషించనుందని, విద్యార్థులు 'దేశమే ప్రథమం' అనే నినాదంతో సమస్యల పరిష్కారానికి నడుం బిగించాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్,బీఆర్ఎస్ చిల్లర రాజకీయాలు మానుకోవాలి.. ఎంపీ అరవింద్ ధ్వజం



నిజామాబాద్ జిల్లా , నవంబరు 21 : కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై బీజేపీ నిజామాబాద్ ఎంపీ అరవింద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ రెండు పార్టీలు చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. ఈరోజు (శనివారం) నిజామాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఎంపీ అరవింద్ మీడియాతో మాట్లాడారు. ఈ జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా అధికారులు చూడాలని సూచించారు. శ్రీకాంత్, ఆచారి లాంటి కుటుంబ సభ్యులతో కాంగ్రెస్, బీఆర్ఎస్ రాజకీయాలు చేయడం దిగజారుడుతనమని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పుడు పాల్గొనలేదని.. ఎప్పుడూ తెలంగాణ కోసం కొట్లాడలేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ బలమైన మిత్రుడు ఉత్తమ్ కుమార్ రెడ్డిని గెలిపించడానికి శ్రీకాంత్ చారి తల్లికి గతంలో హుజారాబాద్ నియోజకవర్గం నుంచి టిక్కెట్ ఇచ్చారని ఆరోపించారు.

కాళేశ్వరం డిజైన్ తప్పు..

తెలంగాణ కోసం కేసీఆర్ బిడ్డ కవిత ఏం త్యాగం చేశారని.. ఎంపీగా ఓడిపోతే మళ్లీ ఎమ్మెల్సీగా ఎలా చేశారని ఎంపీ అరవింద్ ప్రశ్నించారు. శ్రీకాంత్ కుటుంబంపైన అప్పుడు బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని ధ్వజమెత్తారు. కాళేశ్వరం డిజైన్ తప్పు, ప్రతి దాంట్లో తప్పు ఉందని, కాంగ్రెస్ హయాంలోనూ దాన్ని మరమ్మతులు చేయకపోవడం తప్పని చెప్పారు. అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ప్రాణహిత – చేవెళ్ల గ్రావిటీ ద్వారా ఏర్పాటు చేయాలని నిర్ణయించారని అన్నారు. కాళేశ్వరంలో ఆ రెండు పార్టీలు కేడీలేనని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఈగోతో మొదలై.. కరప్షన్‌లతో ముగిసిందని ఎద్దేవా చేశారు. జాతీయ పార్టీ పెట్టడం కోసం కాళేశ్వరాన్ని కేసీఆర్ వాడుకున్నారని ఆరోపించారు. తెలంగాణలో బీజేపీ సునామీ సృష్టించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రాష్ట్రంలో గల్లంతవుతాయని ఎంపీ అరవింద్ విమర్శించారు.

పల్నాడు వాటర్ గ్రిడ్.. సీఎం రేవంత్ రెడ్డికి కవిత అల్టిమేటం



హైదరాబాద్,తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీరు వల్లే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరోసారి జలదోపిడీకి తెరలేపిందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ప్రజాభవన్‌కు చంద్రబాబును పిలిచి కాళ్లు కడిగి, గురుదక్షిణగా మన రాష్ట్ర నీళ్లను ఏపీకి అప్పగించారని ఆరోపించారు. నాగార్జున సాగర్‌పై ఏపీ అక్రమంగా నిర్మిస్తున్న 'పల్నాడు వాటర్ గ్రిడ్' ప్రాజెక్టును వారం రోజుల్లోగా ఆపకపోతే, వేలాది మందితో సాగర్ డ్యామ్‌ను ముట్టడిస్తామని కవిత ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. ఆ సమయంలో జరిగే పరిణామాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ప్రోటోకాల్స్ విస్మరించి రేవంత్ ఒప్పందాలు:

సీఎం రేవంత్ రెడ్డి అన్ని రకాల ప్రోటోకాల్స్‌ను పక్కనపెట్టి వ్యవహరిస్తున్నారని కవిత విమర్శించారు. అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేయాల్సింది పోయి, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో అనధికారిక సమావేశానికి వెళ్లి పోలవరం--బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు అంగీకారం తెలిపి వచ్చారని ఆరోపించారు. రేవంత్ ఇచ్చిన ఆ చనువుతోనే ఇప్పుడు ఏపీ ప్రభుత్వం తాగునీటి పేరు చెప్పి నాగార్జున సాగర్ జలాలకు గండికొడుతోందని మండిపడ్డారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో శ్రీశైలంపై తాగునీటి కోసమని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నిర్మించి, చివరికి మొత్తం రిజర్వాయర్‌నే తరలించుకుపోయారని గుర్తు చేశారు. ఇప్పుడు నాగార్జున సాగర్‌పై ఏపీ కన్ను పడిందని, ఇప్పటికే తాగునీటి కోసం 2.8 టీఎంసీలు తీసుకుంటున్న ఏపీ, ఇప్పుడు లిఫ్ట్ పేరుతో మరో 1.8 టీఎంసీలను అక్రమంగా మళ్లించేందుకు సిద్ధమైందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇంటెలిజెన్స్ వైఫల్యమా? సీఎం సమ్మతితోనేనా?

గత 9 నెలలుగా ఏపీ ప్రభుత్వం అక్రమ ప్రాజెక్టును నిర్మిస్తుంటే తెలంగాణ ప్రభుత్వానికి తెలియలేదంటే ఎలా నమ్మాలని కవిత ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి కేవలం ముఖ్యమంత్రే కాదని, రాష్ట్ర హోంశాఖ మంత్రి కూడా ఆయనేనని గుర్తు చేశారు. ఇది మన ఇంటెలిజెన్స్ వైఫల్యమా లేక సీఎం వైఫల్యమా అని నిలదీశారు. అసలు రేవంత్ రెడ్డి సమ్మతితోనే ఏపీ ప్రభుత్వం ఈ అక్రమ నిర్మాణాన్ని చేపడుతోందని ఆమె సంచలన ఆరోపణ చేశారు.ఏపీ అక్రమంగా చేపడుతున్న ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం 'జల్ జీవన్ మిషన్' కింద 50 శాతం నిధులు కేటాయించడం అత్యంత దారుణమని కవిత అన్నారు. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు వెంటనే ప్రధాని నరేంద్ర మోదీ వద్దకు వెళ్లి ఈ ప్రాజెక్టును ఆపాలని, కేంద్ర నిధులను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

బీజేపీ నేతల మౌనంపై దేనికి?

తెలంగాణ ప్రయోజనాల విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్ర బీజేపీ నేతలు అనుసరిస్తున్న వైఖరిపై కవిత నిప్పులు చెరిగారు. బీజేపీకి తెలంగాణ ప్రజల ఓట్లు, సీట్లు కావాలి తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవా అని ప్రశ్నించారు. ప్రతి విషయంపై నోరు పారేసుకునే ఎంపీ రఘునందన్ రావు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఏపీ అక్రమ ప్రాజెక్టుపై ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. ఏపీలో టీడీపీతో పొత్తు ఉన్నంత మాత్రాన తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడతారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ అక్రమ ప్రాజెక్టును అడ్డుకోవాల్సిన పూర్తి బాధ్యత సీఎం రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులపైనే ఉందని కవిత స్పష్టం చేశారు.

తెలంగాణలో బీసీ డిప్యూటీ సీఎం డిమాండ్ !



హైదరాబాద్, తెలంగాణ మంత్రివర్గ విస్తరణ, పునర్వ్యవస్థీకరణపై చర్చలు ఊపందుకున్న వేళ, రాష్ట్ర కాంగ్రెస్ రాజకీయాల్లో బీసీ డిప్యూటీ సీఎం డిమాండ్ ఒక్కసారిగా కాకరేపుతోంది. రాష్ట్ర జనాభాలో 56 శాతానికి పైగా ఉన్న బలహీన వర్గాలకు అధికారంలో సముచిత వాటా కల్పించాలంటూ ఆ సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు, మంత్రులు ఏకంగా అగ్రనేత రాహుల్ గాంధీ వద్దే తమ గళాన్ని వినిపించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు 15 మంది మంత్రులు ఉండగా, కేబినెట్‌లో ఇంకా రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఈ విస్తరణలోనే ప్రస్తుత ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు అదనంగా ఒక బీసీ నేతకు డిప్యూటీ సీఎం పీఠం కట్టబెట్టాలనే ప్రతిపాదన పార్టీలో తీవ్ర చర్చకు దారితీసింది.జనాభా ప్రాతిపదికన హక్కులు, అధికారం దక్కాలి .. అంటూ దేశవ్యాప్తంగా కులగణన, సామాజిక న్యాయం నినాదాన్ని భుజానికెత్తుకున్న రాహుల్ గాంధీకి ఇప్పుడు సొంత రాష్ట్రం తెలంగాణలోనే అసలైన పరీక్ష ఎదురైంది. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో బీసీ ఓటర్ల పాత్ర అత్యంత కీలకమైనప్పటికీ, కేబినెట్‌లో ఆ సామాజిక వర్గానికి ఆశించిన స్థాయిలో ప్రాతినిధ్యం దక్కలేదనే అసంతృప్తి మొదటి నుంచీ ఉంది. ఇటీవలే పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ భవిష్యత్తులో బీసీ ముఖ్యమంత్రి ఉంటారంటూ చేసిన వ్యాఖ్యలు పార్టీలో కొత్త సమీకరణాలకు తెరలేపాయి. ఇప్పుడు ఏకంగా బీసీ డిప్యూటీ సీఎం పదవి కోసం నేతలు ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేస్తుండటంతో, రాహుల్ గాంధీ తన సామాజిక న్యాయ సిద్ధాంతాన్ని ఇక్కడ ఎంతవరకు అమలు చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది.అయితే, బీసీ నేతకు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వడానికి పార్టీలోని సీనియర్ నేతలు, అగ్రవర్ణ వర్గాలు అంత సులభంగా అంగీకరిస్తాయా అన్నదే అసలు ప్రశ్న. ఇప్పటికే కేబినెట్‌లోని రెండు ఖాళీల కోసం కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి,ప్రేమ్‌సాగర్ రావు వంటి సీనియర్ నేతలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మరోవైపు, ఇప్పటికే ఒక డిప్యూటీ సీఎం పదవి ఎస్సీ సామాజిక వర్గం వద్ద ఉండగా, మరో డిప్యూటీ సీఎం పదవిని సృష్టిస్తే అధికార కేంద్రాలు పెరిగి పరిపాలనలో సమన్వయ లోపం తలెత్తుతుందని సీనియర్లలోని ఒక వర్గం వాదిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా కేబినెట్ కూర్పులో సామాజిక సమతుల్యతతో పాటు, పార్టీలో తన పట్టు సడలకుండా జాగ్రత్త పడాల్సిన సున్నితమైన పరిస్థితి నెలకొంది.వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు మరో రెండేళ్ల సమయం మాత్రమే ఉన్నందున , డిసెంబర్‌లో జరగనున్నట్లు భావిస్తున్న కేబినెట్ విస్తరణ కాంగ్రెస్ భవిష్యత్తుకు అత్యంత కీలకం కానుంది. ఒకవేళ అధిష్టానం బీసీ డిప్యూటీ సీఎం డిమాండ్‌ను పక్కనపెడితే,రాష్ట్రంలోని మెజారిటీ ఓటు బ్యాంకు అయిన బలహీన వర్గాలు పార్టీకి దూరమయ్యే ప్రమాదం ఉంది. ప్రతిపక్షాలైన బీఆర్ఎస్,బీజేపీలు ఇదే అంశాన్ని ఆయుధంగా చేసుకుని కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టే అవకాశం ఉంది. అలాగని డిప్యూటీ సీఎం పదవి ఇస్తే,ఆ పదవి కోసం పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి లేదా ఇతర సీనియర్ బీసీ నేతల మధ్య పోటీ నెలకొని అంతర్గత కుమ్ములాటలు బయటపడే ఛాన్స్ ఉంది.మొత్తంగా చూస్తే, తెలంగాణ కాంగ్రెస్‌లో 'బీసీ డిప్యూటీ సీఎం' అంశం ఇప్పుడు అధిష్టానానికి కత్తిమీద సాములా మారింది.కేవలం నినాదాలు, హామీలతోనే సరిపెట్టకుండా 56 శాతం జనాభా ఉన్న బీసీలకు అత్యున్నత పదవి ఇచ్చి రాహుల్ గాంధీ చరిత్ర సృష్టిస్తారా, లేక సీనియర్ల ఒత్తిడికి తలొగ్గి పాత ఫార్ములాతోనే సర్దుబాటు చేస్తారా అన్నది వేచి చూడాలి.

అనిరుధ్ రెడ్డి... కోమటిరెడ్డిపై చర్యలు ఉంటాయా



హైదరాబాద్, నవంబరు 21, ఒక రాష్ట్రంలో ఒక ప్రభుత్వం అధికారంలో ఉంటే.. ప్రతిపక్షం విమర్శలు చేస్తుంది. ఆరోపణలు చేస్తుంది. నిరసనలు చేపడుతుంది. ఆందోళనలకు పిలుపునిస్తుంది. కానీ తెలంగాణ రాష్ట్రంలో ఇందుకు భిన్నంగా జరుగుతోంది. అధికార పార్టీ మీద అధికార పార్టీ ఎమ్మెల్యేలు.. ముఖ్యంగా ముఖ్యమంత్రి నాయకత్వం మీద ఎమ్మెల్యేలు.. ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిరసనలు చేపడుతున్నారు. బహిరంగ సమావేశాలలో కీలకమైన వ్యాఖ్యలు చేస్తున్నారు.ఒకవేళ ఇలాంటి పరిస్థితి గనుక భారత రాష్ట్ర సమితిలో ఉండి ఉంటే కేసిఆర్ తన్ని తరిమేసేవాడు. అప్పట్లో ఈటల రాజేందర్ గులాబీ పార్టీకి ఓనర్లు మేము అన్నందుకు కేసిఆర్ బయటికి పంపించాడు. దానికంటే ముందు తాటికొండ రాజయ్య వ్యవహార శైలి మీద అభియోగాలు రావడంతో మంత్రివర్గం నుంచి కెసిఆర్ తొలగించారు. కానీ కాంగ్రెస్ పార్టీకి ఇది చేతకాదు. పైగా అధిష్టానం దగ్గర లాబీయింగ్ చేసుకునే వాళ్లకు బ్రహ్మాండంగా పదవులు ఉంటాయి. ఇటీవల కాలంలో రేవంత్ రెడ్డి మీద.. అప్పటి మంత్రి కొండా సురేఖ.. ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాలలో సంచలనం సృష్టించాయి. సుస్మిత చేసిన వ్యాఖ్యల పట్ల అనేక రకాలుగా చర్చలు.. ఇతర సంప్రదింపులు జరిపిన అధిష్టానం ఎట్టకేలకు రేవంత్ రెడ్డి ఒత్తిడి తీసుకొస్తే సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించింది.ఇక అప్పటినుంచి సురేఖ పార్టీ కార్యక్రమాలలో పాల్గొనడం లేదు. పైగా గులాబీ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కు క్షమాపణ చెప్పారు. అప్పటి రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా అలా వ్యవహరించాల్సి వచ్చిందని ఆమె వివరించారు.

తెలంగాణ గ్రామ పంచాయతీలకు నిధుల కొరత..



హైదరాబాద్,తెలంగాణలో గ్రామీణ అభివృద్ధి, గ్రామ పంచాయతీలకు నిధుల కేటాయింపుల అంశం మరోసారి రాజకీయ చర్చకు దారితీసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలు అభివృద్ధి దిశగా ముందుకు సాగాయని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో నిధుల కొరత కారణంగా పల్లెలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. గ్రామ పంచాయతీల ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా మారిందని ఆయన ఆరోపించారు.

గ్రామ పంచాయతీల ఖర్చుల్లో భారీ తగ్గుదల!

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన 'ఫైనాన్సెస్ ఆఫ్ పంచాయతీరాజ్ ఇన్‌స్టిట్యూషన్స్' నివేదికలోని గణాంకాలను కేటీఆర్ తన విమర్శలకు ఆధారంగా ప్రస్తావించారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. 2022-23 ఆర్థిక సంవత్సరంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో తెలంగాణలో ఒక్కో గ్రామ పంచాయతీ సగటున రూ. 16.59 లక్షలు ఖర్చు చేసింది. అయితే 2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి ఈ వ్యయం రూ. 6.24 లక్షలకు తగ్గిపోయిందని కేటీఆర్ పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల ఖర్చుల్లో వచ్చిన ఈ తగ్గుదల గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులపై ప్రభావం చూపుతోందని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రజాధనం అభివృద్ధికి ఉపయోగపడటం లేదంటూ ఆరోపణలు

ప్రజలు చెల్లిస్తున్న పన్నులు, ప్రభుత్వం సమీకరిస్తున్న అప్పుల ద్వారా వచ్చిన నిధులు గ్రామీణ అభివృద్ధి పనులకు సక్రమంగా చేరడం లేదని కేటీఆర్ ఆరోపించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, స్థానిక అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కొరత సమస్యగా మారిందని విమర్శించారు.

రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు అభివృద్ధి కనిపించడం లేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. అభివృద్ధి కార్యక్రమాల కంటే విధ్వంసకర పరిస్థితులే ఎక్కువగా కనిపిస్తున్నాయని ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. మొత్తంగా గ్రామ పంచాయతీల ఖర్చుల తగ్గుదల అంశాన్ని ప్రస్తావిస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. అయితే ఈ గణాంకాల వెనుక ఉన్న కారణాలు, నిధుల విడుదల, ఖర్చుల లెక్కలు వంటి అంశాలను పూర్తిస్థాయిలో పరిశీలించాల్సి ఉంది.

బీఆర్ఎస్ పదేళ్ల అవినీతిని ప్రజలు ఎప్పటికీ మరిచిపోరు

హైదరాబాద్,బీఆర్ఎస్ పదేళ్ల అవినీతిని ప్రజలు ఎప్పటికీ మరిచిపోరు. కాళేశ్వరం పేరుతో జరిగిన అవినీతి, నీటి దోపిడీ, భూదోపిడీకి బీఆర్ఎస్ పాలన నిదర్శనంగా నిలిచిందని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు.రాష్ట్ర నీటి హక్కుల విషయంలో ఒక్క నీటి బొట్టును కూడా వదులుకోబోమని స్పష్టం చేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.



సంపాదకీయం

ఆదివారం 22-11-2026

రుచుల మాటున రోగాల ముప్పు

పండుగంటే స్వీట్లు, మంచి మార్కులు వస్తే చాక్లెట్లు, పుట్టినరోజు అనగానే కేకు, ఫ్రెండ్స్ కలిస్తే పిజ్జా, అలక మాన్పడానికి ఐస్‌క్రీమ్ పరిపాటిగా మారిపోయాయి. జీవనశైలితో పాటు ఆహార అలవాట్లు కూడా గాడి తప్పుతుండటంతో మధుమేహం వంటి వ్యాధులు చుట్టుముడుతున్నాయి. చెప్పాలంటే, మనకు అవసరమైన ఆహారాన్ని మనం ఎంచుకోవడం కంటే, మళ్లీమళ్లీ తినాలని ప్రేరేపించే రుచులే మన పొట్టలోకి ఏం వెళ్లాలో ఎక్కువగా నిర్ణయిస్తున్నాయి. ఇలా ఒకవైపు తినమని ఊరిస్తున్న ఆహార మార్కెట్... మరోవైపు బరువు తగ్గిస్తామంటున్న మందుల ప్రచారం నడుమ ప్రజలు కొన్ని నిజాలు తెలుసుకోవాలి, జాగ్రత్తలు తీసుకోవాలి.ఇంటికి వచ్చిన అతిథిని సిగరెట్ కాల్చండనీ, పిల్లలను మద్యం సేవించండనీ ఎవరూ చెప్పరు. కానీ, కడుపు నిండిందని చెబుతున్నా ఇంకొంచెం తినమని, స్వీట్ తీసుకోమని ఒత్తిడి చేస్తుంటారు. దీనికి కారణం అతిగా తినిపించడాన్ని ఆప్యాయతగా భావించడమే. పెళ్లిళ్లు, పుట్టిన రోజులు, కుటుంబ వేడుకల్లో వడ్డించే భోజనాలు నేడు హోదా ప్రదర్శనలుగా మారిపోయాయి. వందల రకాల వంటకాలు, నాలుగైదు రకాల స్వీట్లు, పక్కనే ఐస్‌క్రీమ్‌లూ తియ్యని పానీయాలు! వేడుక చేసుకోవడం తప్పుకాదు; అతిథులు అతిగా తింటేనే వేడుక బాగా చేసుకున్నారని చెప్పుకోవడం సమస్య అవుతోంది. పొగాకు, మద్యం విషయంలో చూపే అప్రమత్తతను అనారోగ్యకరమైన ఆహార అలవాట్ల విషయంలో చూపించకపోతుండటమే విచారకరం!

చక్కెర స్థాయిలను తగ్గిస్తే చాలా?

చక్కెరలు, శుద్ధిచేసిన పిండి పదార్థాలు, కొవ్వులు అధికంగా ఉండే ప్రాసెస్డ్ ఆహార పదార్థాలు కొందరిని తిండి విషయంలో నియంత్రణ కోల్పోయేలా మారుస్తాయి. ఆకలి లేకపోయినా తినడం, కడుపు నిండినా ఇంకా తినడం సరికాదు. ఊబకాయం అనేది రూపానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు... అది టైప్-2 మధుమేహం, అధిక రక్తపోటు, గుండె వ్యాధుల ముప్పును పెంచుతుంది. కాలేయంలో కొవ్వు పేరుకుపోవడం, కణనష్టం కలిగించే మెటబాలిక్ డిస్‌ఫంక్షన్ అసోసియేటెడ్ స్టీటో హెపటైటిస్, నిద్రలో శ్వాస ఆగిపోవడం, మోకాళ్ల నొప్పులు వంటి సమస్యలకూ కారణమవుతుంది. శరీరంలో పేరుకుపోయిన కొవ్వులకూ... 13 రకాల క్యాన్సర్లకూ సంబంధం ఉంటుంది. వీటిలో పెద్దపేగు, కాలేయం, మూత్రపిండాలు, క్లోమం, గర్భాశయ అంతఃపొర, రొమ్ము, జీర్ణాశయ పైభాగపు క్యాన్సర్ వంటివి ఉంటాయి. స్థూలకాయం ఉన్న ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ రాదు కానీ, ఆ ముప్పు ఎక్కువ ఉంటుందని గ్రహించాలి. ఊబకాయం ఉన్నవారిని నిందించడం, అపహసించడం సరికాదు. 'తక్కువ తినండి, ఎక్కువ నడవండి' అని చెప్పడం సులభమేకానీ, ఆచరణ చాలా కష్టం. నిజానికి ఇది ఆకలి నియంత్రణ, ప్రవర్తన, పరిసరాలతో ముడిపడిన దీర్ఘకాలిక వ్యాధి. దీనికి అవగాహన, కుటుంబ సహకారం, శాస్త్రీయ చికిత్స అవసరం.మధుమేహ చికిత్స అంటే చక్కెర స్థాయిలను తగ్గించడం ఒక్కటే కాదు... కిడ్నీలు, రెటీనా బాగున్నాయా? పాదస్పర్శ సరిగ్గా ఉందా? గుండెకు ముప్పు ఏమైనా ఉందా అన్నదీ తెలుసుకోవాలి. డయాబెటీస్ చికిత్స లక్ష్యం రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంతో ముగియదు. అవయవాలను కాపాడటం, ఇతరత్రా సమస్యలను నివారించడం, వాటి తీవ్రతను గణనీయంగా తగ్గించడం, బాధితులు తమ పనులు తాము చేసుకునేలా చూడటం కూడా చికిత్సలో భాగమే. ఇలాంటి సమగ్ర చికిత్సకు 'జీఎల్‌పీఎన్-1' ఆధారిత కొత్త తరహా మందులు ఉపకరిస్తాయి. చక్కెర స్థాయిలు, బరువును నియంత్రణలో ఉంచడంతో పాటు గుండె, మూత్రపిండాల రక్షణకూ అవి సాయపడతాయి. అలాగని ఇవి మధుమేహానికి సంబంధించిన ప్రతి సమస్యనూ నివారిస్తాయని భావించకూడదు. 'ఐసీఎంఆర్-ఐఎన్‌డీఐఏబీ' అధ్యయనం ప్రకారం, భారత్‌లో 20 ఏళ్లు దాటినవారిలో పది కోట్ల మందికి పైగా మధుమేహంతో బాధపడుతుండగా, మరో 13.6 కోట్ల మంది ప్రీడయాబెటీస్ దశలో ఉన్నారని అంచనా. జాతీయ కుటుంబ ఆరోగ్యసర్వే-6 ప్రకారం, 15-49 ఏళ్ల మహిళల్లో 30.7శాతం, పురుషుల్లో 27.3శాతం మంది అధిక బరువుతో బాధపడుతున్నారు.

మైదానాలకు పంపించాలి...

మన ఆతిథ్యం ఎక్కువ వంటకాల కంటే, అతిథుల ఆహార అవసరాలను గౌరవించేదిగా ఉండటం ముఖ్యం. ఇంట్లో కూడా నియంత్రణ పాటించాలి. ఇంకొంచెం ఎక్కువ తినడం కంటే, సరిపడినంత తినడం ఉత్తమం. రుచుల మాటున దాడిచేసే అనారోగ్య ముప్పు వెంటనే కనిపించకపోచ్చు. కానీ, దాని ఫలితం దీర్ఘకాలంలో జీవన నాణ్యతను దెబ్బతీస్తుంది. అందుకే వయసు, శారీరక పరిస్థితులు, వృత్తిఉపాధుల ఆధారంగా తమకు ఎలాంటి ఆహారం, ఎంత పరిమాణంలో అవసరమన్న అవగాహనను అందరికీ కల్పించాలి. పిల్లలను మైదానాల్లో ఆడుకునేలా ప్రోత్సహించాలి, పెద్దలూ వ్యాయామం చేయాలి. ఇప్పుడు మన నినాదం ఒక్కటే కావాలి: 'విందు గొప్పదనాన్ని వడ్డించిన వంటకాల సంఖ్యతో కాకుండా, అతిథుల ఆరోగ్యంపై చూపిన శ్రద్ధతో కొలుద్దాం'!

మళ్లీ క్వాడ్ హడావుడి!



న్యూఢిల్లీ,రెండేళ్ల తర్వాత మళ్లీ క్వాడ్ పతాక శీర్షికలకు ఎక్కింది. ఇన్నాళ్లూ అది ఉనికిలో లేదన్నట్టే ప్రవర్తించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మంగళవారం ఫిలిప్పీన్స్‌లోని మనీలాలో జరిగిన క్వాడ్ అధినేతల శిఖరాగ్ర సదస్సుకు హాజరయ్యారు. ఇండో--పసిఫిక్ ప్రాంతంలో యథాతథ స్థితిని మార్చొద్దనీ, వ్యాపార కార్యకలాపాలకు ఆంక్షల సంకెళ్లు ద్దనీ చైనాకు ఈ సమావేశం పరోక్ష సందేశం పంపింది. అలాగే క్వాడ్ బిజినెస్ లీడర్స్ ఫోరం ఏర్పాటుచేస్తున్నట్టు కూడా ప్రకటించారు. దాంతోపాటు 'సత్తువతోనే శాంతి' సాధ్యమని తెలిపేలా సముద్రజలాల్లో విమాన గస్తీ విన్యాసాలు 2027లో నిర్వహించ బోతున్నట్టు ట్రంప్ తెలిపారు. క్వాడ్ సభ్యదేశాలైన భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌లలో కాక, ఇందులో భాగస్వామ్యంలేని ఫిలిప్పీన్స్‌లో సదస్సు నిర్వహించటం ఒక్కటే ఆసక్తికర విషయం. చైనాకు సన్నిహితమై, అందువల్లకలిగే లాభాలపై కన్నేసిన ట్రంప్... రెండో దఫా ఏలుబడి మొదలెట్టాక క్వాడ్‌ను పూర్తిగా విస్మరించారు. ఇప్పుడుఈ సదస్సు నిర్వహణ కూడా ఆయన వైఖరి మారడంవల్ల కాదు. గురువారం చైనాలోని షెన్‌జెన్‌లో జరగబోయే ఆసియా--పసిఫిక్ దేశాల సహకార సదస్సు సందర్భంగా చైనా అధినేత షీ జిన్‌పింగ్, రష్యా అధినేత పుతిన్‌లతో తాను నిర్వహించే త్రైపాక్షిక సమావేశా నికి ముందు ఇది అవసరమని ట్రంప్ భావించారు. చైనాతో 'సమర్థవంతంగా' బేరసారా లాడటానికి క్వాడ్ పనికొస్తుందన్నది ఆయన వ్యూహం. అందుకే ఆదరాబాదరాగా అమెరికా దీన్ని నిర్ణయించింది. దాంతోపాటు ఇటీవలి మధ్యంతర ఎన్నికల్లో జనం విశ్వాసాన్ని కోల్పోయిన ట్రంప్ అంతర్జాతీయంగా ఏదో చేస్తున్నట్టు కనబడటానికి కూడా దీన్ని వినియోగించుకున్నారు. దక్షిణ చైనా సముద్రంలో నౌకా రవాణాను అడ్డగిస్తూ యథాతథ స్థితికి ఆటంకాలు కల్పిస్తున్న చైనా తీరుపై జపాన్‌కు మొదట్నించీ ఆగ్రహం ఉంది. చైనా చర్యలతో ప్రధానంగా నష్టపోతున్నది ఆ దేశమే మరి. 2007లో అమెరికా ప్రోద్బలంతో ఆవిర్భవించిన క్వాడ్ ప్రయాణం పడుతూ లేస్తూనే సాగింది. అదే ఏడాది జపాన్‌లో షింజో అబే నిష్క్రమించి టారో అసో ప్రధానిగా వచ్చారు. ఆయన క్వాడ్‌నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. ఆ మరుసటి ఏడాది ఆస్ట్రేలియాలో అధికార మార్పిడి జరిగి జాన్ హోవార్డ్ స్థానంలో కెవిన్ రుడ్ వచ్చారు. అది కూడా క్వాడ్‌కు మంగళం పాడింది. అలాంటి సంస్థకు 2017లో మళ్లీ ప్రాణప్రతిష్ఠ చేసింది ట్రంపే. ఈలోగా దక్షిణ చైనా సముద్రంలో చైనా కార్యకలా పాలు పెంచింది. అక్కడి పగడాల దిబ్బలూ, ఇసుక దిబ్బలూ తనవేనని ప్రకటించి, స్ప్రాట్లీ దీవులచుట్టూ ఏడు కృత్రిమ దీవుల సమాహారాన్ని పూర్తిచేసింది. తనను మించిపోతున్న చైనాను కట్టడి చేయాలంటే దాంతో సమస్యలున్న దేశాలను కటమిగా ఏకం చేసి ఒత్తిడి పెంచాలన్నదే ఆనాటి అమెరికా వ్యూహం. క్వాడ్ పురుడుపోసుకున్నప్పుడే చైనాకు పరిస్థితేమిటో అర్థమైంది. తనకు వ్యతిరేకంగా కూటమి కదుతున్నారంటూ నాలుగు దేశాలకూ దౌత్యపరంగా నిరసన తెలియ జేసింది. అలాగని ఆవిర్భావనంనుంచీ దేన్నీ నేరుగా చెప్పడానికి క్వాడ్ సిద్ధపడలేదు. ఇన్నేళ్లు గడిచినా ఇప్పటికీ పరోక్ష హెచ్చరికలే తప్ప, నిర్దిష్ట కార్యాచరణతో ముందుకొచ్చింది లేదు. ఆ వని జరిగితే చర్చలు మొదలై ఏదో ఒక అంగీకారం సాధ్యపడేది.రెండోసారి అధికారంలోకొచ్చాక ట్రంప్ క్వాడ్‌ను గాలికొదిలేశారు. తన వ్యూహానికి దాన్నొక ఉపకరణంగా వాడుకునే ఇలాంటి ధోరణిని అమెరికా విడనాడనంతకాలం క్వాడ్ 'కాగితం పులే'. ఇప్పుడు అమెరికా, చైనా, రష్యా అధినేతలమధ్య జరగబోయే త్రైపాక్షిక సమావేశంపై ట్రంప్ మిత్రదేశాలతో మాట్లాడిందేమీ లేదు. చైనా, రష్యాలతో వాటికున్న సమస్య లేమిటో తెలుసుకునే ప్రయత్నం చేయలేదు. ఇది క్వాడ్ మనుగడపై సందేహాలు తలెత్తేలా చేస్తుందన్న స్పృహ ఆయనకు లేదు. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా కీలక ఖనిజాల ఎగుమతుల్ని ప్రోత్సహించాల్సిన చైనా, అందుకు భిన్నంగా ఆంక్షలు విధించటాన్ని మనతోపాటు ప్రపంచ దేశాలన్నీ నిరసిస్తున్నాయి. ఈ విషయంలో క్వాడ్‌వంటి కూటములన్ని నమ్ముకోవాలో, ద్వైపాక్షికంగా చైనాతో అంగీకారానికొస్తే మంచిదో ఎవరికి వారు తేల్చుకునే స్థితి ట్రంప్ కల్పించారు. ఆర్భాటాన్ని పక్కనబెట్టి చూస్తే క్వాడ్ శిఖరాగ్రం సాధించింది పెద్దగా ఏంలేదని అర్థమవుతుంది.

25 రోజుల్లో 52 లక్షల పెళ్లిళ్లు...

ముంబై, భారత్‌లో పెళ్లిళ్ల సీజన్ వ్యాపార రంగానికి భారీ ఊతం ఇవ్వనుంది. నవంబర్ 21 నుంచి డిసెంబర్ 15 వరకు కేవలం 25 రోజుల వ్యవధిలో దేశవ్యాప్తంగా సుమారు 52 లక్షల వివాహాలు జరగనున్నాయని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ అంచనా వేసింది. ఈ వివాహాల ద్వారా ఏకంగా రూ.7.5 లక్షల కోట్ల వ్యాపారం జరిగే అవకాశం ఉందని వెల్లడించింది. ఆభరణాలు, దుస్తులు, ఆహార పదార్థాలు, రిటైల్, హోటళ్లు, క్యాటరింగ్, రవాణా, ఈవెంట్ మేనేజ్‌మెంట్ వంటి అనేక రంగాల్లో భారీగా వ్యాపార కార్యకలాపాలు పెరగనున్నాయని తెలిపింది.25 రోజుల పాటు కొనసాగే ఈ వివాహాల సీజన్‌లో రోజుకు సగటున రెండు లక్షలకు పైగా పెళ్లిళ్లు జరగనున్నాయి. దీంతో దేశవ్యాప్తంగా చిన్న వ్యాపారుల నుంచి పెద్ద వ్యాపార సంస్థల వరకు అందరికీ గణనీయమైన ఆదాయం లభించనుంది. ముఖ్యంగా పెళ్లిళ్లకు అవసరమైన వస్తువులు, సేవలకు డిమాండ్ పెరగడంతో మార్కెట్లలో కొనుగోళ్ల సందడి నెలకొననుంది.దేశ రాజధాని ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లోనూ వివాహాల సందడి భారీగా ఉండనుంది. ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో సుమారు ఐదు లక్షల వివాహాలు జరగవచ్చని అంచనా వేసింది. వీటి ద్వారా దాదాపు రూ.2.5 లక్షల కోట్ల వ్యాపారం జరిగే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ అంచనాలను రూపొందించేందుకు రీసెర్చ్ అండ్ ట్రేడ్ డెవలప్‌మెంట్ సొసైటీ దేశవ్యాప్తంగా అధ్యయనం నిర్వహించింది. ఇందులో భాగంగా 25 రాష్ట్రాలకు చెందిన 300 మందికి పైగా వాణిజ్య నాయకులు, 550 వాణిజ్య సంఘాలతో సంప్రదింపులు జరిపింది. ఆయా ప్రాంతాల్లోని వ్యాపార పరిస్థితులు, వివాహాల సంఖ్య, కొనుగోళ్ల ధోరణులు, సేవలపై ఉండే డిమాండ్‌ను పరిశీలించి ఈ అంచనాలను సిద్ధం చేసింది.వివాహాల సందర్భంగా జరిగే ఖర్చుల్లో బంగారు ఆభరణాలు, విలువైన లోహాలు, దుస్తులు ప్రధాన వాటాను ఆక్రమించనున్నాయి. అంచనాల ప్రకారం మొత్తం రూ.7.5 లక్షల కోట్ల వ్యాపారంలో వస్తువులు, రిటైల్ కొనుగోళ్ల వాటా రూ.4.05 లక్షల కోట్లు. అంటే మొత్తం వ్యాపారంలో 54 శాతం ఈ విభాగం నుంచే రానుంది. ఇక సేవల రంగం ద్వారా రూ.3.45 లక్షల కోట్ల వ్యాపారం జరగనుంది. ఇది మొత్తం వ్యాపారంలో 46 శాతంగా ఉంది. వస్తువుల విభాగంలో అత్యధికంగా ఆభరణాలు, విలువైన లోహాల ద్వారా రూ.1.20 లక్షల కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా. ఆ తర్వాత దుస్తులు, వస్త్రాల రంగం రూ.90 వేల కోట్ల వ్యాపారంతో రెండో స్థానంలో నిలవనుంది.ఇక బహుమతులు, వివాహాలకు అవసరమైన ఉపకరణాల ద్వారా రూ.37,500 కోట్లు, కిరాణా సరుకులు, ఆహార సరఫరాల ద్వారా మరో రూ.37,500 కోట్ల వ్యాపారం జరిగే అవకాశం ఉంది. ఎలక్ట్రానిక్ వస్తువులు, డ్రై ఫ్రూట్స్, స్వీట్లు, ఫర్నిచర్, గృహోపకరణాల రంగాల్లో ఒక్కొక్కటి రూ.30 వేల కోట్ల చొప్పున వ్యాపారం జరుగుతుందని అంచనా వేసింది.వివాహాలకు సంబంధించిన సేవల రంగంలోనూ భారీగా ఆదాయం సమకూరనుంది. ముఖ్యంగా క్యాటరింగ్ రంగం రూ.75 వేల కోట్ల వ్యాపారంతో ముందంజలో ఉండనుంది. వివాహ వేదికలు, బాంక్వెట్ హాళ్లు, హోటళ్ల ద్వారా రూ.60 వేల కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా. ఈవెంట్ మేనేజ్‌మెంట్, వెడ్డింగ్ ప్లానింగ్ సేవల ద్వారా రూ.37,500 కోట్లు, పూల అలంకరణ, వివాహ డెకరేషన్ ద్వారా మరో రూ.37,500 కోట్ల ఆదాయం రావచ్చని పేర్కొంది. అలాగే ప్రయాణం, రవాణా సేవల ద్వారా రూ.30 వేల కోట్లు, సంగీతం, వినోద కార్యక్రమాల ద్వారా మరో రూ.30 వేల కోట్ల వ్యాపారం జరగనుంది. ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ సేవలు రూ.22,500 కోట్లు, బ్యూటీ సర్వీసులు మరో రూ.22,500 కోట్ల ఆదాయాన్ని ఆర్జించవచ్చని అంచనా వేసింది.వివాహాల సీజన్ వ్యాపారాన్ని పెంచడమే కాకుండా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను కూడా కల్పించనుంది. ఈ 25 రోజుల వ్యవధిలో దేశవ్యాప్తంగా సుమారు 1.25 కోట్ల తాత్కాలిక, సీజనల్, పార్ట్‌టైమ్ ఉద్యోగ అవకాశాలు ఏర్పడవచ్చని అంచనా వేసింది. క్యాటరింగ్, డెకరేషన్, ఫోటోగ్రఫీ, హోటల్ నిర్వహణ, రవాణా, ఈవెంట్ మేనేజ్‌మెంట్, బ్యూటీ సర్వీసులు వంటి రంగాల్లో పెద్ద సంఖ్యలో కార్మికులు, సిబ్బంది అవసరం ఏర్పడనుంది. వంటవాళ్లు, సర్వర్లు, డ్రైవర్లు, అలంకరణ నిపుణులు, ఫోటోగ్రాఫర్లు, మేకప్ ఆర్టిస్టులు, ఈవెంట్ నిర్వాహకులకు ఈ సీజన్‌లో మంచి అవకాశాలు లభించనున్నాయి.వివాహాల సీజన్ నేపథ్యంలో ఢిల్లీలోని ప్రధాన వాణిజ్య మార్కెట్లలో వ్యాపార కార్యకలాపాలు మరింత ఊపందుకోనున్నాయి. చాందినీ చౌక్, సదర్ బజార్, కరోల్ బాగ్, లజపత్ నగర్, గాంధీ నగర్, ఖారీ బౌలీ



వంటి మార్కెట్లలో కొనుగోళ్లు పెరుగుతాయని వ్యాపార సంఘం అంచనా వేస్తోంది. ఈ మార్కెట్లకు ఢిల్లీతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో కొనుగోలుదారులు వస్తుంటారు. పెళ్లిళ్లకు అవసరమైన దుస్తులు, ఆభరణాలు, అలంకరణ వస్తువులు, బహుమతులు, ఆహార పదార్థాల కొనుగోళ్లతో హోల్‌సేల్, రిటైల్ వ్యాపారాలకు మంచి గిరాకీ ఏర్పడనుంది.భారత్‌లో వివాహాల నిర్వహణకు చేసే ఖర్చుల్లోనూ భారీ వ్యత్యాసాలు కనిపిస్తున్నాయని తెలిపింది. సాధారణంగా నిర్వహించే పెళ్లిళ్లకు సుమారు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చవుతుండగా, అత్యంత విలాసవంతమైన వివాహాలకు రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ ఖర్చు చేస్తున్నారని పేర్కొంది. వివాహాల నిర్వహణలో ఈ స్థాయి వ్యయాలు ఉండటం వల్ల పెద్ద సంస్థలతో పాటు చిన్న వ్యాపారులు, స్థానిక తయారీదారులు, చేతివృత్తులవారు, సేవా ప్రదాతలకు కూడా ఆదాయం సమకూరుతుందని వివరించింది.దేశంలో వివాహాలకు సంబంధించిన వ్యాపారం ప్రతి ఏడాది గణనీయంగా పెరుగుతున్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. 2022లో దేశవ్యాప్తంగా సుమారు 32 లక్షల వివాహాలు జరగగా, వాటి ద్వారా రూ.3.75 లక్షల కోట్ల వ్యాపారం నమోదైంది. 2023లో వివాహాల సంఖ్య 38 లక్షలకు పెరగడంతో వ్యాపారం రూ.4.74 లక్షల కోట్లకు చేరింది. 2024లో సుమారు 48 లక్షల వివాహాల ద్వారా రూ.5.90 లక్షల కోట్ల వ్యాపారం జరిగినట్లు అంచనా వేసింది. 2025లో సుమారు 46 లక్షల వివాహాలు జరగ్గా, వివాహ సంబంధిత వ్యాపారం రూ.6.50 లక్షల కోట్లకు చేరినట్లు సంస్థ వెల్లడించింది. తాజాగా 2026 నవంబర్ 21 నుంచి డిసెంబర్ 15 మధ్య జరిగే వివాహాల ద్వారా రూ.7.5 లక్షల కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా వేయడం ఈ రంగం విస్తృతిని తెలియజేస్తోంది.వివాహాలు కేవలం కుటుంబ వేడుకలు మాత్రమే కాదని, దేశ ఆర్థిక కార్యకలాపాలకు కూడా కీలకంగా మారుతున్నాయని సెక్రటరీ జనరల్ ప్రవీణ్ ఖండేల్వాల్ తెలిపారు. వ్యాపారులు, తయారీదారులు, చేతివృత్తులవారు, చిన్న వ్యాపార సంస్థలు, సేవా ప్రదాతలను ఒకే గొలుసులో అనుసంధానిస్తూ వివాహాలు పెద్ద ఎత్తున ఆర్థిక కార్యకలాపాలను సృష్టిస్తున్నాయని పేర్కొన్నారు. వివాహాల సందర్భంగా చేసే ఖర్చులు దేశీయ తయారీ రంగానికి, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు మద్దతుగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. అందువల్ల వినియోగదారులు విదేశీ ఉత్పత్తుల కంటే భారతదేశంలో తయారైన వస్తువులకు, స్థానిక వ్యాపారులకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది.మారుతున్న కాలానికి అనుగుణంగా వివాహాల నిర్వహణలోనూ సాంకేతికత వినియోగం పెరుగుతోందని పేర్కొంది. డిజిటల్ ఆహ్వాన పత్రికలు, ఆన్‌లైన్ చెల్లింపులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత వివాహ ప్రణాళికలు, వ్యక్తిగత అభిరుచులకు అనుగుణంగా రూపొందించే బహుమతులు, ఆన్‌లైన్ వెడ్డింగ్ సేవలు కొత్త వ్యాపార అవకాశాలను సృష్టిస్తున్నాయని తెలిపింది.మొత్తంగా చూస్తే, నవంబర్ 21 నుంచి డిసెంబర్ 15 వరకు జరగనున్న వివాహాల సీజన్ దేశంలోని వ్యాపార, వాణిజ్య రంగాలకు కీలకంగా మారనుంది. ఆభరణాల దుకాణాల నుంచి హోటళ్ల వరకు, దుస్తుల వ్యాపారుల నుంచి ఈవెంట్ నిర్వాహకుల వరకు అనేక రంగాలకు ఈ సీజన్ భారీ ఆదాయాన్ని అందించే అవకాశం ఉంది. 52 లక్షల వివాహాలు, రూ.7.5 లక్షల కోట్ల అంచనా వ్యాపారం, 1.25 కోట్ల ఉపాధి అవకాశాలతో భారత వివాహ రంగం మరోసారి దేశ ఆర్థిక వ్యవస్థలో తన ప్రాధాన్యతను చాటుకోనుంది.

ట్రిపుల్ గ్రోత్ మిషన్ కు శ్రీకారం

తిరుపతి, ఆంధ్రప్రదేశ్‌ను సమగ్రంగా అభివృద్ధి చేస్తూ, భారీ ఎత్తున పారిశ్రామిక పెట్టుబడులు , ఉపాధి అవకాశాలను సృష్టించే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ట్రిపుల్ గ్రోత్ మిషన్ కు శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోని మూడు కీలక ప్రాంతాలైన విశాఖపట్నం, తిరుపతి , అమరావతి ఆర్థిక ప్రాంతాల అభివృద్ధి ప్రణాళికలపై ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. మౌలిక సదుపాయాల కల్పన, పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధి, తీరప్రాంత పర్యాటకం, పోర్టుల అనుసంధానం, ఎగుమతులను ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.విశాఖపట్నం ఆర్థిక ప్రాంతం పరిధిలో మొత్తం 167 అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రణాళికలు రూపొందించగా, అందులో ఇప్పటికే 64 ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయి. వైజాగ్ బే సిటీ ని ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతూ ఐటీ, డేటా సెంటర్లు, పోర్టులు, పారిశ్రామిక హబ్‌ల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. దీని ద్వారా కొత్తగా 15 నుంచి 20 ప్రముఖ ఐటీ కంపెనీలను ఆకర్షించడంతో పాటు, 2 లక్షల ఉద్యోగాల కల్పన హామీలను కార్యరూపంలోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.మరోవైపు, తిరుపతి ఆర్థిక ప్రాంతాన్ని సెమికండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, ఎలక్ట్రిక్ వాహనాలు , గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్, డిఫెన్స్ , ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 87 గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులలో ఏకంగా 66 ప్రాజెక్టులు ఈ ప్రాంతంలోనే రానుండటం విశేషం. అంతేకాకుండా, ఈ రీజియన్ పరిధిలోని 14 పట్టణాలను ప్రత్యేక పారిశ్రామిక హబ్‌లుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.ఇక రాజధాని ప్రాంతమైన అమరావతి ఆర్థిక ప్రాంతంలో 4.65 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో 48 భారీ ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. క్వాంటమ్ టెక్నాలజీ, ఐటీ, లాజిస్టిక్స్, పోర్టు ఆధారిత పరిశ్రమలు , అగ్రి వాల్యూ చైన్‌లపై అమరావతి రీజియన్‌లో ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. విశాఖపట్నం, తిరుపతి, అమరావతిలను మూడు ప్రధాన ఆర్థిక శక్తి కేంద్రాలుగా తీర్చిదిద్దడం ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సమాన అభివృద్ధి, యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు లభించనున్నాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

6 నెలల్లో జగన్ ఈడీ కేసులు తేలిపోతాయా

విజయవాడ, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై దశాబ్దానికి పైగా సాగుతున్న అక్రమాస్తుల కేసుల విచారణలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దూకుడు పెంచింది. ప్రజాప్రతినిధులపై ఉన్న కేసుల విచారణను వేగవంతం చేయాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలు, అలాగే రోజువారీ విచారణ జరపాలని కోరుతూ ఈడీ ఇటీవల తెలంగాణ హైకోర్టును ఆశ్రయించడంతో నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టులో ఈ కేసుల విచారణ వేగం పుంజుకుంది.సుమారు 141 డిశ్చార్జ్ పిటిషన్ల కారణంగా ఏళ్ల తరబడి ప్రీ-చార్జ్ దశలోనే నిలిచిపోయిన విచారణ ప్రక్రియకు మోక్షం లభించడంతో,రాబోయే ఆరు నెలల్లో ఈడీ కేసుల విచారణ ఒక కొలిక్కి వచ్చే అవకాశాలు ఉన్నాయని న్యాయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.ఈడీ నమోదు చేసిన మనీలాండరింగ్ కేసుల వివరాలను పరిశీలిస్తే?2004 నుంచి 2009 మధ్య వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జరిగిన వివిధ ప్రభుత్వ కేటాయింపులు, క్విడ్ ప్రో కో పెట్టుబడుల ఆధారంగా సీబీఐ 11 ఛార్జిషీట్లు దాఖలు చేయగా, వాటికి అనుబంధంగా ఈడీ 9 ప్రధాన ప్రాసిక్యూషన్ ఛార్జిషీట్లు దాఖలు చేసింది. వీటిలో వాన్‌పిక్ , పెన్నా సిమెంట్స్, ఇండియా సిమెంట్స్, దాల్మియా సిమెంట్స్, జగతి పబ్లికేషన్స్, సండూర్ పవర్, లేపాక్షి నాలెడ్జ్ హబ్, రాంకీ ఫార్మా, హెటిరో-అరబిందో వంటి కీలక వ్యాపార సంస్థలకు సంబంధించిన మనీలాండరింగ్ మరియు ఆస్తుల జప్తు వ్యవహారాలు ఉన్నాయి. ఈ కేసుల్లో జగన్ మోహన్ రెడ్డి, విజయసాయిరెడ్డి సహా దాదాపు 70 మందికి పైగా నిందితులపై ఈడీ అభియోగాలు మోపింది.ప్రస్తుతం సీబీఐ ప్రత్యేక కోర్టులో సీబీఐ కేసులతో పాటే ఈడీ కేసులపై కూడా రోజువారీ విచారణ కొనసాగుతుండటం అత్యంత కీలక పరిణామం. ఇప్పటికే మెజారిటీ ఛార్జిషీట్లపై విచారణ కీలక దశకు చేరుకోగా, తాజాగా దాల్మియా సిమెంట్స్ ఛార్జిషీటు దాఖలు చేసింది. భారతి సిమెంట్స్ వంటి అత్యంత కీలక వ్యవహారాలకు సంబంధించిన ఛార్జిషీట్లపై ఈడీ ప్రత్యేక దృష్టి సారించింది. గతంలో ఈ సంస్థల్లోకి వచ్చిన పెట్టుబడులు, అక్రమ నిధుల మళ్లింపు, ఆస్తుల అటాచ్‌మెంట్‌కు సంబంధించిన సమగ్ర ఆధారాలను ఈడీ ఇప్పటికే కోర్టుకు సమర్పించినందున నిందితులపై అభియోగాల నమోదు, సాక్షుల విచారణ ప్రక్రియ వేగంగా ముందుకు సాగుతోంది.ప్రస్తుత వేగం ఇలాగే కొనసాగితే ఈడీ కేసుల్లో ఆరు నెలల్లో కోర్టు తీర్పు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. సాధారణ కేసులతో పోలిస్తే ఈడీ కేసుల్లో విచారణ భిన్నం

విశాఖ రైల్వే స్టేషన్‌కు కొత్త లుక్...

విశాఖపట్టణం , విశాఖ రైల్వే స్టేషన్ త్వరలోనే కొత్త లుక్‌లోకి రానుంది. సిటీ స్థాయికి తగ్గట్టుగా ఈ స్టేషన్‌ను తీర్చిదిద్దే పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం స్టేషన్‌లో ఉన్న 8 ప్లాట్‌ఫారాల సంఖ్యను 14కు పెంచేలా విస్తరణ పనులు రైల్వే శాఖ అధికారులు చేపడుతున్నారు. వీటికి తోడు అదనంగా ఆరు కొత్త రైల్వే లైన్లు అందుబాటులోకి రానున్నాయి. రైళ్ల రాకపోకల నియంత్రణలో వేగం, భద్రతను పెంచేందుకు అత్యాధునిక “ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్” వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న ఈ డెవలప్‌మెంట్ పనుల పురోగతిని విశాఖ ఎంపీ భరత్ పరిశీలించారు.విశాఖ రైల్వే స్టేషన్ త్వరలోనే కొత్త లుక్‌ని సంతరించుకోనుంది. విశాఖ సిటీ స్థాయికి తగినట్టుగా ఈ స్టేషన్‌ను తీర్చిదిద్దే పనులు వేగంగా సాగుతున్నాయి. ప్రస్తుతం విశాఖ రైల్వేస్టేషన్ నుంచి నిత్యం సుమారు 80 వేల మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ నుంచి రోజురోజుకూ ప్రయాణికుల రద్దీ పెరుగుతుంది. అదనపు రైళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. ప్రయాణికులకు మెరుగైన, ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి తీసుకు రావాలనుకుంది.ఇందులో భాగంగా ప్రస్తుతం స్టేషన్‌లో ఉన్న 8 ప్లాట్‌ఫారాల సంఖ్యను 14కు పెంచేలా విస్తరణ పనులు చేపడుతున్నారు. వీటికి తోడు అదనంగా ఆరు కొత్త రైల్వే లైన్లు అందుబాటులోకి రానున్నాయి. రైళ్ల రాకపోకల నియంత్రణలో వేగం, భద్రతను పెంచేందుకు అత్యాధునిక “ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్” వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఆధునికీకరణ పనులన్నింటినీ ఎట్టి పరిస్థితుల్లోనూ అనుకున్న సమయానికి పూర్తి చేసేందుకు రైల్వే శాఖ స్పష్టమైన లక్ష్యాన్ని ఖరారు కూడా చేసింది.విశాఖ రైలు ప్రయాణికులను ఎన్నో ఏళ్లగా వేధిస్తున్న ప్రధాన సమస్యకు ఈ ప్రాజెక్ట్‌తో శాశ్వత పరిష్కారం లభించనుంది. కోచింగ్ యార్డు నిర్మాణ తీరు కారణంగా టెర్మినేటింగ్ రైళ్లు, ఇతర మార్గాల్లో వెళ్లే రైళ్లు ఒకే ట్రాక్‌లను దాటాల్సి వస్తోంది. దీనివల్ల ప్లాట్‌ఫారాల లభ్యత తగ్గిపోయి, స్టేషన్ బయట అప్రోచ్ సిగ్నళ్ల వద్ద రైళ్లు గంటల తరబడి నిలిచిపోతున్నాయి. ఈ ట్రాఫిక్ అడ్డంకులకు పరిష్కారం లభించనుంది.స్టేషన్‌లో ప్రయాణికుల మౌలిక సౌకర్యాలకు కూడా రైల్వే శాఖ పెద్దపీట వేస్తోంది. ప్రయాణికుల రాకపోకలు మరింత సులభతరం చేసేందుకు స్టేషన్‌కు తూర్పు వైపున సరికొత్త ఎంట్రీని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ప్రయాణికుల రిజర్వేషన్ కేంద్రాన్ని మరింత అనువైన కొత్త ప్రదేశానికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా వాహనదారుల ఇబ్బందులను తొలగించేందుకు పార్కింగ్ సదుపాయాలను పెంచనున్నారు. ఒకేసారి 450 కార్లు, 2,000 బైక్‌లను ఈజీగా పార్క్ చేసుకునేలా విశాలమైన పార్కింగ్ ప్రాంతాన్ని డెవలప్ చేస్తున్నారు.విశాఖ పట్నం రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న ఈ డెవలప్‌మెంట్ పనుల పురోగతిని విశాఖ ఎంపీ భరత్ పరిశీలించారు. నిర్మాణ ప్రాంతాలను చెక్ చేసిన అనంతరం ఆయన రైల్వే ఉన్నతాధికారులు, కాంట్రాక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విశాఖ రైల్వేస్టేషన్‌ను మెరుగు పరుస్తామని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ ప్రయాణికులకు మంచి సేవలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. విశాఖ రైల్వేస్టేషన్ దేశంలోనే అత్యుత్తమ రైల్వేస్టేషన్‌గా ప్రత్యేక గుర్తింపు పొందాలని ఎంపీ భరత్ స్పష్టం చేశారు.

జల దోపిడీని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం

నల్లగొండ : పల్నాడు వాటర్ గ్రిడ్ పేరుతో నాగార్జునసాగర్ విజయపురి వద్ద, పోతిరెడ్డిపాడు ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న జలాల తరలింపు వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విమర్శించారు. ఈ అంశంపై ఆయన నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ.. తాగునీటి అవసరాల పేరుతో జలదోపిడీకి తెరలేపుతూ రహస్యంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. గత ఎనిమిది నెలలుగా ఈ పనులు జరుగుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించకపోవడం, విషయం తెలిసిన తర్వాత కూడా కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు నిద్రమత్తులో ఉన్నట్లు వ్యవహరిస్తున్నారని, ఈ జలదోపిడీకి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగించే విధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కృష్ణా నదీ జలాల విషయంలో విభజన చట్టాన్ని అమలు చేసి తెలంగాణకు రావాల్సిన నీటి వాటాను తేల్చాలని కోరారు. తెలంగాణకు చెందిన బీజేపీ మంత్రులు, ఎంపీలు ఈ వ్యవహారంపై తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల' నినాదంతో సాధించుకున్న తెలంగాణలో జలదోపిడీని సహించేది లేదని, ఈ అన్యాయానికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎనిమిది నెలలుగా పనులు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. వీర్లపాలెంలో ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులను అరెస్టు చేసి, పోలీసు బందోబస్తు మధ్య కార్యక్రమాన్ని నిర్వహించడం అమానుషమని మండిపడ్డారు. గిరిజన, దళిత వర్గాలు నివసించే ప్రాంతాల సమీపంలో కాలుష్యకారక పరిశ్రమలను ఏర్పాటు చేయడం అన్యాయమన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఫార్మా కంపెనీల కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వీర్లపాలెంలో ఇథనాల్ పేరుతో నిర్మిస్తున్న పరిశ్రమను వెంటనే నిలిపివేసి, ఆ ప్రతిపాదనను విరమించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజల జీవనహక్కులు, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కోరారు.

టేకులపల్లిలో ఇసుక ట్రాక్టర్ బోల్తా.. యువకుడు మృతి..

టేకులపల్లి, ఇసుక ట్రాక్టర్ బోల్తాపడి ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదం ఓ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. కుటుంబానికి ఆసరాగా ఉన్న భర్తను కోల్పోయి తొమ్మిది నెలల గర్భిణి అయిన భార్య, ఐదేళ్ల కుమార్తె దిక్కులేనివారయ్యారు. భద్రాద్రి కొత్తగూడెంలో ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. టేకులపల్లి మండలం గంగారం పంచాయతీ పరిధిలోని చర్లపల్లికి చెందిన మధు ఇసుక ట్రాక్టర్‌పై డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి కూడా అదే పనికి వెళ్లాడు. సంపత్ నగర్ నుంచి టేకులపల్లి వైపు వస్తుండగా అదుపుతప్పిన ఇసుక ట్రాక్టర్ బోల్తాపడింది. ట్రాక్టర్ ఇంజన్ మధుపై పడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజమౌళి తెలిపారు.
ఇసుక ట్రాక్టర్లపై నిఘా ఏదీ?: మండలంలో ఇసుక ట్రాక్టర్ల రాకపోకలు, వాటి వేగంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో సంబంధిత అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. భర్తను కోల్పోయి తొమ్మిది నెలల గర్భిణిగా ఉన్న ప్రియ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలవాలని స్థానికులు కోరుతున్నారు.

సికింద్రాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు.. 6 నుంచి 8 నెలల పాటు ఇబ్బందులు

హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని రాణిగంజ్ జంక్షన్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి ఆధునికీకరణ పనుల కారణంగా భారీ ట్రాఫిక్ ఆంక్షలు అమల్లోకి రానున్నాయి. ఈ నెల 20 నుంచి రైల్వే అధికారులు చేపట్టనున్న ఈ పనులు సుమారు 6 నుంచి 8 నెలల పాటు కొనసాగనున్నాయి.
ఈ నేపథ్యంలో రాణిగంజ్, ఎంజీ రోడ్డు, ట్యాంక్‌బండ్, కర్బలా మైదాన్ పరిసర ప్రాంతాల్లో వాహనాల రద్దీ పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా పలు ప్రాంతాల్లో దారి మళ్లింపులు, ఆంక్షలు విధిస్తున్నట్లు ట్రాఫిక్ అడ్వైజరీలో వెల్లడించారు.అండర్ బ్రిడ్జి వద్ద చేపట్టే తవ్వకాలు సుమారు 1.5 మీటర్ల లోతు వరకు ఉండనున్నాయి. దాదాపు మూడు క్యారేజ్‌వే లేన్ల పరిధిలో పనులు జరగనుండటంతో మిగిలే ఒక లేన్ (ఆర్-2) మాత్రమే వాహనాల రాకపోకలకు అందుబాటులో ఉంటుంది. అది కూడా తేలికపాటి వాహనాలైన ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లకు మాత్రమే పరిమితం చేశారు. రాణిగంజ్ జంక్షన్ నుంచి ప్యారడైజ్ ఎక్స్ రోడ్స్, అక్కడి నుంచి బోవెన్‌పల్లి వైపు వెళ్లే వాహనాలకు ఈ మార్గంలో అనుమతి ఉంటుంది.

భారీ వాహనాలకు 16 ప్రాంతాల్లో మళ్లింపు...

రవాణా వాహనాలు, సరుకు రవాణా వాహనాలు, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు, ఆర్టీసీ బస్సులను రాణిగంజ్ అండర్ బ్రిడ్జి మార్గంలో అనుమతించరు. వీటిని 16 ప్రధాన ప్రాంతాల వద్ద ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించనున్నారు.
ఎస్‌బీఐ ఎక్స్ రోడ్స్: భారీ వాహనాలను రసూల్‌పురా మీదుగా బేగంపేట వైపు మళ్లిస్తారు.
పట్నీ ఎక్స్ రోడ్స్: జేబీఎస్ బస్టాండ్, స్వీకార్ ఉపకార్, వైఎంసీఏ మీదుగా ఎస్‌బీఐ ఎక్స్ రోడ్స్ వైపు వచ్చే భారీ వాహనాలకు సీటీసీ--ప్యారడైజ్ మార్గంలోని ఎస్‌డీ రోడ్డులోకి ప్రవేశం ఉండదు. వాటిని క్లాక్‌టవర్ వైపు మళ్లిస్తారు. అలాగే క్లాక్‌టవర్ నుంచి వచ్చే భారీ వాహనాలనూ ఎస్‌డీ రోడ్డులోకి అనుమతించరు. వాటిని ఎస్‌బీఐ ఎక్స్ రోడ్స్ వైపు పంపిస్తారు.
ప్లాజా జంక్షన్: భారీ వాహనాలను సీటీఓ, రసూల్‌పురా, బేగంపేట వైపు మళ్లిస్తారు.
పార్క్ లేన్ ఎక్స్ రోడ్: పట్నీ ఎక్స్ రోడ్ వైపు దారి మళ్లిస్తారు.
ప్యారడైజ్ ఎక్స్ రోడ్స్: సీటీఓ వైపు పంపిస్తారు.
సీటీఓ జంక్షన్: మెదక్--బోవెన్‌పల్లి వైపు నుంచి జాతీయ రహదారి 44 మీదుగా వచ్చే భారీ వాహనాలను రెండు మార్గాల్లో మళ్లిస్తారు. కుడివైపు వచ్చే వాహనాలను రసూల్‌పురా-మోనప్ప--నీరంకారి-లక్డీకాపూల్ మీదుగా పంపిస్తారు. ఎడమవైపు వచ్చే వాహనాలను ఎస్‌బీఐ ఎక్స్ రోడ్--వైఎంసీఏ-సంగీత్ ఎక్స్ రోడ్-రైల్ నిలయం-అలుగడ్డబావి జంక్షన్ మీదుగా ముషీరాబాద్ లేదా మెట్టుగూడ వైపు మళ్లిస్తారు.
రసూల్‌పురా ఎక్స్ రోడ్స్: బేగంపేట-మోనప్ప--నీరంకారి మార్గంలో పంపిస్తారు.
రాణిగంజ్ ఎక్స్ రోడ్స్: అదవయ్య ఎక్స్ రోడ్--డిప్టిలరీ రోడ్--కర్బలా జంక్షన్ వైపు మళ్లిస్తారు.
నల్లగుట్ట ఎక్స్ రోడ్: నెక్లెస్ రోడ్ వైపు దారి మళ్లింపు ఉంటుంది. ఈ మార్గంలో కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుంది.
ఘాస్మండి ఎక్స్ రోడ్: బాటా, బైబిల్ హౌస్ వైపు పంపిస్తారు.
బైబిల్ హౌస్: జబ్బార్ కాంప్లెక్స్--సీజీఓ టవర్స్ మీదుగా ముషీరాబాద్ వైపు వెళ్లేలా మళ్లిస్తారు.
కర్బలా ఎక్స్ రోడ్స్: భారీ వాహనాలకు అనుమతి ఉండదు. వాటిని బైబిల్ హౌస్ జంక్షన్--జబ్బార్ కాంప్లెక్స్--సీజీఓ టవర్స్ మీదుగా ముషీరాబాద్ వైపు మళ్లిస్తారు. సెయిలింగ్ క్లబ్ (ట్యాంక్‌బండ్ వైపు): ట్యాంక్‌బండ్ మీదుగా రాణిగంజ్ వైపు వచ్చే భారీ వాహనాలను సెయిలింగ్ క్లబ్ వద్ద కవాడిగూడ వైపు మళ్లిస్తారు.డీబీఆర్ మిల్స్: ఎగువ ట్యాంక్‌బండ్ వైపు వచ్చే భారీ వాహనాలను డీబీఆర్ మిల్స్ వద్ద గాంధీనగర్ టీ జంక్షన్--కవాడిగూడ--సీజీఓ టవర్స్--ముషీరాబాద్ ఎక్స్ రోడ్స్ వైపు మళ్లిస్తారు.పాత అంబేద్కర్ విగ్రహం (ట్యాంక్‌బండ్ వైపు): ట్యాంక్‌బండ్ నుంచి రాణిగంజ్ వైపు వచ్చే భారీ వాహనాలను అంబేద్కర్ టీ జంక్షన్ లేదా తెలుగు తల్లి ఫ్లైఓవర్ జంక్షన్ వద్ద మళ్లిస్తారు. అక్కడి నుంచి లిబర్టీ-హిమాయత్‌నగర్-నారాయణగూడ-ఆర్టీసీ ఎక్స్ రోడ్స్ మీదుగా వెళ్లాలి.
కట్టమైసమ్మ: తెలంగాణ తల్లి ఫ్లైఓవర్ నుంచి వచ్చే భారీ వాహనాలను కట్టమైసమ్మ వద్ద మళ్లిస్తారు. అవి ఇందిరాపార్క్ ఎక్స్ రోడ్స్--అశోక్‌నగర్--ఆర్టీసీ ఎక్స్ రోడ్స్ మార్గంలో వెళ్లాల్సి ఉంటుంది.



తేలికపాటి వాహనాలకు ప్రత్యేక మార్గాలు

కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలకు కూడా కొన్ని మార్పులు చేశారు. ప్యారడైజ్, మినిస్టర్ రోడ్ వైపు నుంచి రాణిగంజ్‌కు వచ్చే వాహనాలను రాణిగంజ్ ఎక్స్ రోడ్ వద్ద డిప్టిలరీ రోడ్ మీదుగా కర్బలా జంక్షన్ వైపు మళ్లిస్తారు. నల్లగుట్ట ఎక్స్ రోడ్ నుంచి వచ్చే వాహనాలను నెక్లెస్ రోడ్ వైపు పంపిస్తారు. కర్బలా జంక్షన్ వద్ద సాధారణంగా తేలికపాటి వాహనాల రాకపోకలకు అనుమతి ఉంటుంది.అధిక ఎత్తు కలిగిన వాహనాలు ఆంక్షలు ఉన్న మార్గాల్లోకి ప్రవేశించకుండా ఐదు ప్రాంతాల్లో హైట్ రిస్ట్రిక్టర్ రైలింగ్‌లు ఏర్పాటు చేయనున్నారు. పట్నీ ఎక్స్ రోడ్స్, ప్యారడైజ్ ఎక్స్ రోడ్, పార్క్ లేన్ ఎక్స్ రోడ్, రసూల్‌పురా ఎక్స్ రోడ్, కర్బలా ఎక్స్ రోడ్ వద్ద వీటిని ఏర్పాటు చేస్తారు. వీటి ఎత్తు పరిమితి 10 అడుగులుగా నిర్ణయించారు.

ఈ 18 జంక్షన్ల వద్ద రద్దీ..

పనులు కొనసాగుతున్న సమయంలో ఎస్‌బీఐ ఎక్స్ రోడ్, స్విమ్మింగ్ పూల్ యూ టర్న్, ప్లాజా, పట్నీ జంక్షన్, ప్యారడైజ్ జంక్షన్, పార్క్ లేన్ ఎక్స్ రోడ్స్, రాణిగంజ్ జంక్షన్, అదవయ్య ఎక్స్ రోడ్స్, నల్లగుట్ట ఎక్స్ రోడ్, ఘాస్మండి ఎక్స్ రోడ్స్, సెయిలింగ్ క్లబ్, కర్బలా ఎక్స్ రోడ్, బైబిల్ హౌస్ ఎక్స్ రోడ్, సీజీఓ టవర్స్, చిల్డ్రన్స్ పార్క్, కవాడిగూడ ఎక్స్ రోడ్, లేపాక్షి, పాత అంబేద్కర్ విగ్రహం ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

ట్రాఫిక్ హెల్ప్‌లైన్ ఏర్పాటు

వాహనదారులు ప్రయాణానికి ముందే తమ మార్గాన్ని ప్రణాళిక చేసుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. అత్యవసర సహాయం కోసం ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్ 9010203626ను సంప్రదించవచ్చని తెలిపారు. ట్రాఫిక్ మార్పులు, తాజా సమాచారం కోసం హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల ఫేస్‌బుక్ పేజీ, ఎక్స్ (ట్విట్టర్) ఖాతాను అనుసరించాలని కోరారు.

బోసిపోతున్న ప్రాజెక్టులు.. బోరుమంటున్న రైతులు



ఆదిలాబాద్ : ఒకప్పుడు నిండు కుండల్లా ఉండే ప్రాజెక్టులు ప్రస్తుతం బోసిపోయి కనిపిస్తున్నాయి. గోదావరి ప్రక్కనే పారుతున్నా ఉమ్మడి ఆదిలాబాద్‌లోని రైతులకు చుక్క నీరు దొరకడం లేదు. ఒకవైపు అధికారులు సాగునీరు ఇవ్వలేమని, తాగునీటికే ప్రాధాన్యతనిస్తున్నామంటుంటే రైతులు ఈ నెలాఖరు వరకు సాగు నీరు ఇవ్వాలని లేకపోతే పంటలు ఎండిపోతాయని వాపోతున్నారు. ప్రస్తుతం పొట్ట దశకు చేరుకున్న వరి పంటలు ఎండిపోగా కొన్ని ప్రాంతాల్లో రైతులు వరి పంటలకు నిప్పు పెట్టి నిరసన తెలిపారు. కడెం ప్రాజెక్టు నుండి సాగునీరు నిలిపివేయవద్దని రైతులు పలు చోట్ల పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టగా, అధికారులు తాత్కాలికంగా నిలిపివేయలేదు. ఈ నెలాఖరు వరకు సాగునీటిని పంటలకు అందించే విషయమై కసరత్తులు చేస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో పూర్తి నీటి సామర్థ్యం 20.00 కాగా ప్రస్తుతం 8.88 టీఎంసీలు మాత్రమే ఉంది. అదేవిధంగా కొమురంభీం ఆసిఫాబాద్లోని అడ ప్రాజెక్టులో 1.20 టీఎంసీలకు గాను ప్రస్తుతం 0.60 టీఎంసీలు, గడ్డెన్నవాగులో పూర్తి సామార్థ్యం 1.50 టీఎంసీలు కాగా డెడ్ స్టోరేజీకి చేరువలో ఉంది. మత్తడి వాగు ప్రాజెక్టులో 0.47టీఎంసీలు గాను పూర్తిగా డెడ్ స్టోరేజీకి చేరుకుంది. సాత్నాల ప్రాజెక్టులో 1.24 టీఎంసీలకు గాను 0.55 టీఎంసీలకు చేరుకుంది. స్వర్ణ ప్రాజెక్టులో 250 టీఎంసీలకు గాను 0.80 టీఎంసీలు మాత్రమే ఉంది. కడెం ప్రాజెక్టులో 7.60 టీఎంసీలకు గాను 2.06 టీంఎసీలు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో పూర్తి సామర్థ్యం 80.50 కాగా 34.81 టీఎంసీలు మాత్రమే ఉండగా, రైతులు ఆందోళన చెందుతున్నారు. కడెం ప్రాజెక్టు ఉమ్మడి జిల్లాలో అత్యంత కీలకమైనది కాగా, ప్రస్తుతం పూడిక తీత లేకపోవడంతో 3.49 టీఎంసీలు మాత్రమే ఉండగా, సగానికి పైగా పూడికతో నిండిపోయింది. దీని క్రింద 68,150 ఎకరాలు నిర్మల్, మంచిర్యాల జిల్లాలలో ఉండగా, ప్రస్తుతం నీటి నిల్వలు 2.06 టీఎంసీలకు చేరడంతో పంటలకు సాగు నీరు అందే అవకాశాలు లేకుండా పోతున్నాయి. కేవలం 93 క్యూసెక్కులు ఔట్ ఫ్లో, ఎడమ కాల్వకు 162 క్యూసెక్కులు, కుడి కాల్వకు 9 క్యూసెక్కులు ఉండగా, సాగునీరు అందే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. ప్రాజెక్టులో 2.8 మిలియన్ క్యూబిక్ మీటర్ల పూడిక తీయాల్సి ఉండగా, ఇప్పటి వరకు కూడా పనులు ప్రారంభించలేదు. దీంతో ప్రతీ యేడాది నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతూనే ఉంది. ఉత్తర తెలంగాణ వరప్రదాయనీ శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 80.50 టీఎంసీలు కాగా, 1091 అడుగులు మాత్రమే ఉంది. దీని క్రింద 17.85 లక్షల ఎకరాలు సాగు చేస్తుండగా, నిజామాబాద్ లో 1.60 లక్షలు, ఆదిలాబాద్ 1.45 లక్షలు, కరీంనగర్ లో 6.72 లక్షలు, వరంగల్ లో 4.71 లక్షలు, ఖమ్మంలో 1.68 లక్షలు, నల్గొండ లో 2.87 లక్షల ఆయకట్టు ఉంది. అయితే శ్రీరాం సాగర్ లో సాగు నీటి మట్టం ఎందుకు తగ్గుతుందంటే, ఎగువన మహారాష్ట్రలో బాబ్లీతో సహా 11 ప్రాజెక్టులు వరద నీటికి అడ్డంకిగా ఉండటం, బాబ్లీ గేట్లు తెరిచినా, ఎగువన వర్షాలు లేక నీరు రావడం లేదు. శ్రీరాం సాగర్‌కు వచ్చే వరదలో 80శాతం మహారాష్ట్ర నుండే వస్తుంది. అయితే ప్రాజెక్టుల కారణంగా నీరు రావడం లేదు. శ్రీరాం సాగర్ పరిధిలో 38వేల ఎకరాలకు సాగు నీరు ఇచ్చే సరస్వతీ కాల్వకు ఈ నెల 5నే నీటిని నిలిపివేశారు. అదే విధంగా కడెం ప్రాజెక్టు క్రింద ఈ నెల 9 నుండి, స్వర్ణ ప్రాజెక్టు కింద ఈ నెల 2వ వారం నుండి సాగు నీటిని విడుదల చేయడం బంద్ చేశారు. ప్రాజెక్టులో 2.16 టీఎంసీల నీటిని వచ్చే యేడాది మే నెల వరకు తాగునీటికే ఉపయోగించాలని అధికారులు నిర్ణయించారు.ఆదిలాబాద్ మున్సిపాలిటికి ప్రస్తుతం చనాఖా-కొరాటా కాల్వ నుండి నీరు తీసుకోవాలని చూస్తుండగా, లంబసింగి వద్ద రూ.4 కోట్లతో చెక్ డ్యామ్, రూ. 10 కోట్లతో కొత్త వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంటు నిర్మించాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. బైంసా, నిర్మల్ కు నీరందించే గడ్డెన్నవాగు, స్వర్ణ ప్రాజెక్టుల్లోనూ నీటి మట్టం తగ్గింది. బాసర త్రిపుల్ ఐటీ తాగునీటి కొరత కారణంగా కొన్ని తరగతులను నిలిపివేశారు. ప్రస్తుతం ప్రాజెక్టుల్లోనే నీటిమట్టం తగ్గుతుండటంతో రైతులు ఆందోళన చెందుతూ ఖరీఫ్ పంటలు ఇప్పటికీ చేతికి రాలేదని, యాసంగి పంటల సంగతి ఏమిటో అర్థం కావడం లేదని ఆందోళన చెందుతున్నారు.

అణు ముప్పు తగ్గింపుపై చర్చలకు అగ్రరాజ్యాల నిర్ణయం

ప్రపంచ రాజకీయాల్లో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. అగ్రరాజ్యాలైన అమెరికా, చైనా, రష్యా అణ్వాయుధాల ముప్పును తగ్గించే దిశగా కలిసి పనిచేయాలని నిర్ణయించాయి. చైనాలోని షెన్‌జెన్‌లో గురువారం జరిగిన సమావేశంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పాల్గొన్నారు. ఈ భేటీ అనంతరం వారు నాలుగు ప్రధాన అంశాలతో కూడిన ఉమ్మడి ప్రకటనను విడుదల చేశారు.అణుయుద్ధంలో ఎవరూ విజయం సాధించలేరని, అలాంటి యుద్ధం ఎప్పటికీ సంభవించకూడదని ముగ్గురు నేతలు తమ ప్రకటనలో స్పష్టం చేశారు. అణ్వాయుధాల విస్తరణను నిరోధించడం, అణు ప్రమాదాలను తగ్గించడం కోసం పరస్పరం చర్చలు కొనసాగించాలని వారు అంగీకరించారు. అయితే, తమ దేశాల్లోని అణ్వాయుధాల సంఖ్యను తగ్గించేందుకు ఎటువంటి నిర్దిష్ట లక్ష్యాలను వారు ప్రకటించలేదు.వీటితోపాటు ఐక్యరాజ్యసమితిలో సంస్కరణల ఆవశ్యకతను కూడా నేతలు నొక్కిచెప్పారు. ప్రపంచ శాంతి, భద్రతలకు ఎదురవుతున్న సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేలా ఐరాసను తీర్చిదిద్దాలని వారు అభిప్రాయపడ్డారు. అలాగే, శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తుల సరఫరాను పెంచేందుకు కలిసి పనిచేయాలని నిర్ణయించారు.ఈ సమావేశానికి ముందు ట్రంప్.. పుతిన్, జిన్‌పింగ్‌లతో

లతీఫ్ భట్ ఎన్‌కౌంటర్ వేళ.. మౌంటెన్ ర్యాట్స్..?

జమ్మూకశ్మీర్ : జమ్మూకశ్మీర్‌లో కరుడుగట్టిన ఉగ్రవాది లతీఫ్ భట్ ఎన్‌కౌంటర్ వేళ ఓ కమాండో వీడియో ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. గుబురు గడ్డంతో.. ఖాకీ వస్త్రం తొడుగు ఉన్న ఏకే-203 రైఫిల్, మిలిటరీ గేర్‌తో రగ్గ్డ్ లుక్‌తో ఉన్న ఈ కమాండో వీడియో సోషల్ మీడియాలో కనిపిస్తోంది. ఆపరేషన్లలో పాల్గొన్న సిబ్బంది పేర్ల విషయంలో భద్రతా దళాలు గోప్యత పాటిస్తాయి. అయితే, అతడి డ్రెస్‌పై ఉన్న బ్యాడ్జ్ ఆధారంగా సైన్యంలోనే అత్యంత శక్తిమంతమైన '9 పారా స్పెషల్ ఫోర్స్' కమాండోగా భావిస్తున్నారు. ఈ బెటాలియన్‌కు 'మౌంటెన్ ర్యాట్స్', 'పైరేట్స్', 'ఘోస్ట్ ఆపరేటర్స్' అనే నిక్‌నేమ్స్ ఉన్నాయి. సైన్యంలో ఈ ఫోర్స్ అత్యంత ప్రత్యేకం. దీని కమాండోలు జమ్మూకశ్మీర్‌లోని రాష్ట్రీయ రైఫిల్స్‌తోపాటు ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లలో చురుగ్గా పాల్గొంటారు.యుద్ధంలోనే దీని పుట్టుక..: 1965లో భారత్-పాక్ యుద్ధం వేళ శత్రు భూభాగాల్లోకి చొచ్చుకెళ్లి మెరుపు దాడులు చేయడానికి సైన్యంలో కర్నల్ మేఘ్ సింగ్ ఓ ప్రత్యేక యూనిట్‌ను ఏర్పాటు చేశారు. దీని శిక్షణ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. దీనిని మేఘ్‌దూత్ ఫోర్స్‌గా వ్యవహరించేవారు. 1965 యుద్ధంలో 'హాజీ పీర్ బల్జ్' వద్ద ఈ దళం పాక్ స్థావరాలపై మెరుపు దాడులు చేసి.. దాని స్వాధీనానికి మార్గం సుగమం చేసింది. దీని పనితీరు చూసి.. ఈ దళంతో 1966 జులై 1వ తేదీన 9వ పారాచూట్ కమాండో బెటాలియన్ ఏర్పాటు చేశారు. సైన్యంలో ఏర్పాటు చేసిన తొలి స్పెషల్ ఫోర్స్ ఇదే అని చెబుతారు. "మినిమం మెన్.. మ్యాక్సిమమ్ ఇంపాక్ట్" అనేది దీని నినాదం. ఉధంపూర్ కేంద్రంగా పనిచేసే వీరు పర్వత యుద్ధ తంత్రంలో దిట్టలు. దీంతోనే వీరికి 'మౌంటెన్ ర్యాట్స్' అనే పేరు వచ్చింది. చిన్న దళాలుగా వెళ్లి శత్రువులకు భారీ నష్టం చేయడం వీరి శైలి.డిఫెండర్ ఆఫ్ పూంచ్..: 1971లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధం వే

మెడికల్ టూరిజం హబ్‌గా హైదరాబాద్.. ప్రపంచానికి తెలంగాణ ఆదర్శం!



హైదరాబాద్,ఆరోగ్య రంగంలో తెలంగాణను ప్రపంచానికి ఆదర్శంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఈ లక్ష్య సాధనలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు, హాస్పిటళ్ల యాజమాన్యాలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్‌కు ఉన్న వైద్యరంగ సామర్థ్యాన్ని మరింత విస్తరించి, మెడికల్ టూరిజంలో నగరాన్ని గ్లోబల్ హబ్‌గా అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. సెక్రటేరియట్‌లో గురువారం నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ హెల్త్ కేర్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆరోగ్య రంగాల్లో వస్తున్న మార్పులు, తెలంగాణలో వైద్య సేవల విస్తరణ, మెడికల్ టూరిజం అభివృద్ధి, వైద్య విద్య, నైపుణ్యాల పెంపు తదితర అంశాలపై చర్చించారు. తెలంగాణలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ప్రపంచస్థాయి వైద్య నిపుణులు, అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. వీటిని సమన్వయం చేసుకుంటూ అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్‌లో హెల్త్‌కేర్ రంగ ప్రతినిధులంతా భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ హాస్పిటళ్లలోనూ మెడికల్ టూరిజం సేవలు

మెడికల్ టూరిజం అభివృద్ధికి ప్రైవేటు రంగంతోపాటు ప్రభుత్వ హాస్పిటళ్లలోనూ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. సనత్‌నగర్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్, నిమ్స్, అల్వాల్ టిమ్స్, కొత్తపేట టిమ్స్‌లలో ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం వార్డులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటళ్లలో ఉన్న అత్యుత్తమ వైద్య నైపుణ్యాలు, మౌలిక సదుపాయాలను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా విదేశీ రోగులకు కూడా నాణ్యమైన వైద్య సేవలు అందించవచ్చన్నారు. ఇందుకోసం ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మెడికల్ టూరిజం అభివృద్ధి కోసం ఆరోగ్యశాఖలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని సమావేశంలో పాల్గొన్న డాక్టర్లు మంత్రిని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. అంతర్జాతీయ రోగులకు అవసరమైన సేవలు, సమన్వయం, ఇతర సదుపాయాలను ఒకే వ్యవస్థ ద్వారా అందించే దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు తమ వంతు సహకారం అందిస్తామని కొందరు ప్రైవేటు హాస్పిటళ్ల డాక్టర్లు తెలిపారు. కేన్సర్ చికిత్సను జిల్లా స్థాయిలోనే అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రతి జిల్లాలో కీమోథెరపీ సెంటర్లు ఏర్పాటు చేయడాన్ని, డయాలసిస్ సెంటర్ల నెట్‌వర్క్‌ను విస్తరిస్తూ కిడ్నీ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని డాక్టర్లు ప్రశంసించారు. ఈ సమావేశంలో తెలంగాణ ఫార్మా వైస్ ప్రెసిడెంట్, కౌన్సిల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ కొండపల్లి సాహితి, కిమ్స్-సన్‌షైన్ ఎండీ డా. గురువా రెడ్డి, ఫిక్కీ మెంబర్ సర్జన్ డా. విజయ్ కుమార్, రెయిన్‌బో హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డా. ప్రశాంత్, యూఎన్ మాజీ అధికారి డాక్టర్ శివ దుబిశెట్టి, యశోద హాస్పిటల్ ప్రతినిధి డా. దశరథ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తులం బంగారం లక్ష? ఎందుకీ క్రాష్.. ఏం జరిగింది..



హైదరాబాద్, బంగారం ధర మొన్నటిదాకా రాకెట్ వేగంతో దూసుకుపోయింది. పట్ట పగ్గాలు లేకుండా పెరిగిపోయింది. దీంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రంగంలోకి దిగాల్సి వచ్చింది. బంగారం కొనకండి అయ్యా బాబు అని చెప్పాల్సి వచ్చింది. నరేంద్ర మోడీ మాట విని చాలామంది బంగారం కొనలేదు. ఒకవేళ కొనుగోలు జరిగినప్పటికీ అవి తక్కువ స్థాయిలోనే. నిన్నటిదాకా బంగారం ధర ఆకాశంలోనే విహరించేది. కానీ ఒక్కసారిగా మార్పు వచ్చింది. ధర పతనమైంది. బంగారం మాత్రమే కాదు.. వెండి కూడా నేల చూపులు చూస్తోంది.భారతీయులకు బంగారం అంటే విపరీతమైన ఇష్టం. బంగారాన్ని కేవలం నగల కోసం మాత్రమే కాకుండా పెట్టుబడికి సాధనంగా ఉపయోగిస్తుంటారు. కష్టకాలంలో ఆదుకునే ఆర్థిక భరోసాగా భావిస్తూ ఉంటారు. అందుకే బంగారం ధరలు పెరిగినా. తగ్గినా సామాన్యుల నుంచి మొదలుపెడితే ఇన్వెస్టర్ల వరకు చాలా ఆసక్తిగా గమనిస్తూ ఉంటారు. అయితే 2026 లో బంగారం.. వెండి మార్కెట్లలో ధరల మార్పులు విపరీతంగా చోటుచేసుకున్నాయి. దీంతో పెట్టుబడుదారులు ఆలోచనలో పడ్డారు. ఒకప్పుడు రికార్డు స్థాయి చేరుకున్న బంగారం ధరలు ఇప్పుడు ఎందుకు ఇలా నేలచూపులు చూస్తున్నాయి.. వెండి ధరలు కూడా ఎందుకు పడిపోతున్నాయి.. ఈ పతనం వెనుక అనేక కారణాలు ఉన్నాయి.బంగారం ధరలు పెరుగుతూనే ఉంటాయని భావించే వారికి 2026 లో ఊహించని పరిణామం ఎదురైంది. ఒకప్పుడు సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరిన బంగారం ధరలు ఇప్పుడు భారీగా పడిపోతున్నాయి. వెండి పరిస్థితి కూడా దీనికి భిన్నంగా లేదు. నవంబర్ 20న దేశీయ కమోడిటీ మార్కెట్లో బంగారం ధర దాదాపు నాలుగు శాతం పడిపోయింది. వెండి ధర దాదాపు ఆరు శాతం క్షీణించింది. దీంతో ఇన్వెస్టర్లలో ఆందోళన మొదలైంది.నవంబర్ 20న ఎంసీఎక్స్ లో డిసెంబర్ గోల్డ్ ఫ్యూచర్స్ ధర 10 గ్రాములకు సుమారు 1,22,561 కు పడిపోయింది. వెండి ఫ్యూచర్స్ కిలోకు సుమారు 1,48, 050 కి తగ్గిపోయింది. అంతకుముందు రోజు ముగింపు ధరలతో పోలిస్తే బంగారం దాదాపు 4891.. వెండి 9432 రూపాయలు తగ్గాయి. ఈ ఏడాది జనవరిలో బంగారం 10 గ్రాములకు సుమారు 1.83 లక్షల గరిష్ట స్థాయిని అందుకుంది. వెండి కూడా 4.04 లక్షల స్థాయిని తాకింది. ఆ గరిష్ట స్థాయిలతో పోల్చి చూస్తే ప్రస్తుతం ఈ రెండు లోహాల ధరలలో భారీ పతనం కనిపిస్తోంది.బంగారం ధరలు తగ్గడానికి ప్రధాన కారణాలలో ఒకటి అమెరికా ఫెడరల్ రిజర్వ్ వ్యవహారం. అమెరికాలో ధరల స్థాయి ఇంకా పూర్తిగా అదుపులోకి రాలేదు. దీంతో వడ్డీరేట్లు తగ్గే అవకాశం లేదని వార్తలు వస్తున్నాయి. అవసరమైతే వడ్డీ రేట్లు పెంచే అవకాశం ఉందని ఫెడరల్ రిజర్వ్ అధికారులు సంకేతాలు ఇస్తున్నారు.ఒకవేళ వడ్డీ రేట్లు పెరిగితే బ్యాంకు డిపాజిట్లు.. బాండ్లు వంటి వడ్డీ ఆదాయం ఇచ్చే పెట్టుబడుల మీద ఇంట్రెస్ట్ పెరుగుతుంది. కానీ బంగారం ఎలాంటి వడ్డీ ఆదాయాన్ని ఇచ్చే అవకాశం ఉండదు. దీంతో ఇన్వెస్టర్లు బంగారం మీద పెట్టుబడులను తగ్గించి ఇతర మార్గాల వైపు మొగ్గు చూపుతున్నారు. దీనివల్ల పసిడి ధరల మీద ఒత్తిడి పెరుగుతోంది.బంగారం.. వెండి అంతర్జాతీయ మార్కెట్లో ప్రధానంగా అమెరికా డాలర్లలోనే ట్రేడ్ అవుతూ ఉంటాయి. డాలర్ విలువ పెరిగినప్పుడు ఇతర దేశాల కరెన్సీలతో బంగారం కొనుగోలు చేయడం ఖరీదు అవుతుంది. దీంతో అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గే అవకాశం ఉంటుంది. మనదేశంలో తులం బంగారం ధర లక్ష వరకు పడిపోవచ్చని కూడా తెలుస్తోంది.నవంబర్ 20 నాటికి డాలర్ ఇండెక్స్ 19 నెల గరిష్ట స్థాయికి సమీపంలో ఉండడం కూడా బంగారం.. వెండి ధరల మీద ఒత్తిడి పెంచింది. ముఖ్యంగా విదేశీ ఇన్వెస్టర్లు డాలర్ వైపు మొగ్గు చూపడంతో పసిడి మార్కెట్లో అమ్మకాల ఒత్తిడి పెరిగిపోయింది.బంగారం ధరలు పడిపోవడానికి మరో కారణం అమెరికా ట్రెజరీ బాండ్లపై రాబడి అధికంగా ఉండడం. సాధారణంగా బాండ్లపై వచ్చే వడ్డీ రాబడి పెరిగితే పెట్టుబడిదారులు బంగారం కంటే వాటిపై ఆసక్తి చూపుతారు. ఎందుకంటే బంగారం ధర పెరిగితే పెట్టుబడిదారులకు లాభం వస్తుంది. కానీ బాండ్ల ద్వారా నిర్దిష్ట వడ్డీ ఆదాయం లభిస్తుంది.. ప్రస్తుతం అమెరికాలో ధరలపై ఆందోళనలు.. వడ్డీ రేట్ల అంచనాలు బాండ్ల రాబడి మీద ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిణామం బంగారంపై పెట్టుబడుల ఆకర్షణను పూర్తిగా తగ్గిస్తోంది.2025, 2026 ప్రారంభంలో బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. దీంతో ముందుగానే పెట్టుబడులు పెట్టిన వారు తమ లాభాలను వెనక్కి తీసుకోవడం మొదలుపెట్టారు. దీనిని ప్రాఫిట్ బుకింగ్ అని పిలుస్తుంటారు. మరోవైపు షేర్ మార్కెట్లో నష్టాలు ఎదుర్కొంటున్న కొంతమంది ఇన్వెస్టర్లు నగదు సమీకరించడానికి బంగారం.. వెండి వంటి ఆస్తులను కూడా విక్రయిస్తున్నట్టు మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. ఫ్యూచర్స్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టినవారు ధరలు పడిపోవడంతో తమ స్థాయిలను తగ్గించడం కూడా అమ్మకాల ఒత్తిడిని పెంచుతోంది.వెండి విషయంలో కూడా మరో ప్రత్యేకమైన అంశముంది. బంగారం ప్రధానంగా పెట్టుబడి.. ఆభరణాల కోసం ఉపయోగిస్తారు. వెండికి సౌర విద్యుత్ ప్యానల్స్.. ఎలక్ట్రానిక్స్.. పారిశ్రామిక రంగాలలో వినియోగిస్తారు. పారిశ్రామిక డిమాండ్ మీద ఆందోళనలు పెరిగితే వెండి ధరలు నేలచూపులు చూస్తాయి.బంగారం ధరలు భారీగా తగ్గడంతో కొనుగోలుదారుల్లో కొత్త ఆశలు మొదలయ్యాయి. ముఖ్యంగా పెళ్లిలో సీజన్లో ఆభరణాలు కొనాలని అనుకుంటున్నా వారికి విదల పతనం కొంతమేర ఊరట ఇస్తుంది. అయితే ఇప్పుడు ధరలు తగ్గాయని భారీగా బంగారాన్ని కొనుగోలు చేయడం కంటే.. మార్కెట్ పరిస్థితులను జాగ్రత్తగా పరిశీలించడం అత్యంత అవసరం. వచ్చే రోజుల్లో అమెరికా ఫెడరల్ బ్యాంక్ రిజర్వు నిర్ణయాలు.. డాలర్ విలువ.. అంతర్జాతీయ స్థాయిలో ధరల స్థాయి.. కేంద్ర బ్యాంకుల బంగారం కొనుగోళ్లు ధరలను ప్రభావితం చేసే అవకాశం ఉంది.

కడప రాజకీయాల్లో సంచలనం...



కడప: వైఎస్ఆర్ కడప జిల్లా రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. జిల్లా పరిషత్ చైర్మన్ ఎంపికపై జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కడప జడ్పీ చైర్మనుగా మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డిని ఎంపిక చేయడం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి నచ్చలేదని చెబుతున్నారు. తన సోదరుడు కుమారుడు రాజేష్ రెడ్డికి ఈ పదవి ఇవ్వాలని ఎమ్మెల్యే కోరినట్లు చెబుతున్నారు. ఆయన ప్రతిపాదనను పరిశీలించలేదన్న ఆవేదనతో తీవ్ర అసంతృప్తికి లోనైనట్లు చెబుతున్నారు. దీంతో పదవికి రాజీనామా చేయాలని ఎమ్మెల్యే నిర్ణయం తీసుకున్నారని చెబుతున్నారు. ఈ కారణంగానే కడపలో జరిగే జడ్పీ చైర్మను ప్రమాణస్వీకారానికి హాజరుకాకుండా హుటాహుటిన విజయవాడ బయలు దేరివచ్చారని చెబుతున్నారు.కడప జెడ్పీ చైర్మన్ పీఠం చేజారడాన్ని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారని చెబుతున్నారు. కడప జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని తన సోదరుడి కుమారుడు డాక్టర్ చదిపిరాళ్ల రాజేష్ రెడ్డికి ఇప్పించుకునేందుకు ఆదినారాయణ రెడ్డి చివరి నిమిషం వరకు తీవ్రంగా ప్రయత్నించారు. ఒకానొక దశలో ఈ పదవి విషయంలో ఆయనకు సానుకూల హామీ కూడా లభించినట్లు వార్తలు వినిపించాయి. అయితే, కూటమి నేతల తుది పంపకాల్లో బీజేపీకి కృష్ణా జిల్లా జెడ్పీ పీఠం ఖరారు కాగా, కడప జెడ్పీ చైర్మన్ పదవిని టీడీపీ సీనియర్ నేత పుత్తా నరసింహా రెడ్డికి కేటాయించారు. దీంతో ఆదినారాయణ రెడ్డి వర్గం తీవ్ర నిరాశకు గురైందని అంటున్నారు.జెడ్పీ చైర్మన్ ఎంపికపై అధికారిక ప్రకటన వెలువడిన వెంటనే ఆదినారాయణ రెడ్డి తన ముఖ్య అనుచరులు, మద్దతుదారులతో కలిసి రాత్రికి రాత్రే హుటాహుటిన విజయవాడకు చేరుకున్నారు. అక్కడ తన వర్గీయులతో భవిష్యత్ కార్యాచరణపై కీలక మంత్రాంగం నిర్వహించినట్లు సమాచారం. కేవలం ఎమ్మెల్యే మాత్రమే కాకుండా, ఆయనకు మద్దతుగా జమ్మలమడుగు, ముద్దనూరు, ఎర్రగుంట్ల ప్రాంతాలకు చెందిన జడ్పీటీసీ సభ్యులు కూడా తమ పదవులకు రాజీనామా చేసే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం ఊపందుకుంది. 2014లో వైసీపీ నుంచి గెలుపొందిన ఆదినారాయణ రెడ్డి, ఆ తర్వాత టీడీపీలో చేరి మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. తిరిగి 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగి జమ్మలమడుగు నుంచి విజయం సాధించారు. జిల్లాలో ముఖ్యంగా పులివెందుల వంటి కీలక ప్రాంతాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో వైసీపీని దీటుగా ఎదుర్కోవడంలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించారు. అలాంటి నేపథ్యంలో కడప జెడ్పీ పీఠం విషయంలో భంగపాటు ఎదురవడంతో ఆదినారాయణ రెడ్డి మనస్తాపానికి లోనయ్యారని చెబుతున్నారు. దీంతో ఆయన తీసుకోబోయే నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

లిఫ్ట్ అడిగి, ఫోన్ చోరీ

హైదరాబాద్,మైలార్‌దేవ్‌పల్లిలో మెహఫిల్ హోటల్ సమీపంలో ఒక బైకర్ పై కత్తితో దాడి జరిగింది. తన పని ముగించుకొని.. బైక్‌పై ఇంటికి పయనమైన ఒక వ్యక్తి(57)ని మెహఫిల్ హోటల్ సమీపంలో ఓ వ్యక్తి లిఫ్ట్ అడిగాడు. దాంతో అతను బైకు ఆపి లిఫ్ట్ ఇచ్చారు. అయితే.. పై జేబులో ఫోన్ ఉండటం చూసి దాన్ని చోరీ చేసేందుకు ప్రయత్నం చేసాడు. బైకర్ వెంటనే చెయ్యి పట్టుకోగా.. ఆయనపై కత్తితో రెండుసార్లు దాడి చేసాడు. బాధితుడి గొంతు కోయడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. స్థానికులు క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు. నిందితుడుదాడి చేసిన అనంతరం అక్కడి నుంచి పారిపోయాడు.

విశాఖపట్నం బే సిటీ.. అమెరికా సిలికాన్ వ్యాలీని మించి..



విశాఖపట్నంఒకప్పుడు హైదరాబాద్ అంటే చార్మినార్, బిర్యానీ.. చారిత్రాత్మకమైన కట్టడాలు గుర్తుకు వచ్చేవి. కానీ ఇప్పుడు హైదరాబాద్ పేరు వినగానే ఐటీ కంపెనీలు.. గ్లోబల్ టెక్ సంస్థలు.. సైబరాబాద్.. హైటెక్ సిటీ గుర్తుకు వస్తాయి. ఈ మార్పు వెనుక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయాలు ఉన్నాయి. అప్పట్లో హైదరాబాద్ నగరానికి హైటెక్ సిటీని పరిచయం చేసిన ఆయన.. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం నగరానికి అనుబంధంగా మరో ఆధునిక నగరాన్ని అభివృద్ధి చేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దానికి బే టెక్ సిటీగా నామకరణం చేశారు. దాదాపు మూడు దశాబ్దాల క్రితం హైదరాబాదులో ప్రారంభమైన ఐటీ విప్లవానికి.. ఇప్పుడు విశాఖపట్నంలో ప్రతిపాదిస్తున్న బే టెక్ సిటీ కి మధ్య చాలా ఆసక్తికరమైన పోలిక ఉంది.1990 దశకంలో హైదరాబాద్ ను ఐటీ రంగంలో అంతర్జాతీయ స్థాయిలోకి తీసుకువెళ్లాలనే లక్ష్యంతో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు అడుగులు వేశారు. ఈ కార్యక్రమంలోనే మాదాపూర్ ప్రాంతంలో హైటెక్ సిటీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఎల్ అండ్ టీ కంపెనీ.. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టు ఏర్పాటయింది. సుమారు 158 ఎకరాలలో 150 కోట్ల ఖర్చుతో ఈ ప్రాజెక్టు తొలి దశలో భాగంగా సైబర్ టవర్స్ నిర్మాణమైంది.1998 నవంబర్ 22న అప్పటి ప్రధానమంత్రి వాజ్ పేయి సైబర్ టవర్స్ ను నిర్మించారు. ఆ తర్వాత ఒరాకిల్.. ఐబీఎం.. మైక్రోసాఫ్ట్ వంటి అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్ వైపు అడుగులు వేశాయి. హైటెక్ సిటీ చుట్టూ మాదాపూర్.. గచ్చిబౌలి.. కొండాపూర్ ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందాయి. ఐటీ ఉద్యోగులు.. రియల్ ఎస్టేట్.. హోటల్స్.. వాణిజ్య కార్యకలాపాలకు హైదరాబాద్ కేంద్రంగా మారింది.ఇప్పుడు చంద్రబాబు దృష్టి, విశాఖపట్నం నగరం మీద పడింది. హైదరాబాద్ లో సైబరాబాద్ ను అభివృద్ధి చేసిన తరహాలోనే విశాఖపట్నం అనుబంధంగా మరో ఆధునిక నగరాన్ని అభివృద్ధి చేయాలని ఆయన అధికారులకు దిశా నిర్దేశం చేశారు. నవంబర్ 19న విశాఖపట్నం.. అమరావతి.. తిరుపతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధిపై నిర్వహించిన సమీక్షలో విశాఖ ప్రాంతానికి సంబంధించిన యాంకర్ ప్రాజెక్టుకు విశాఖపట్నం బే సిటీ గా పేరు ఖరారు చేశారు. విశాఖపట్నం కేవలం ఒక నగరంగా కాకుండా పరిశ్రమలు.. ఐటీ.. వాణిజ్యం.. పర్యాటకం.. పోర్టులు.. రవాణా వ్యవస్థలతో అనుసంధానమైన ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దాలి అనేది ఈ ప్రణాళిక వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. సైబరాబాద్ తరహాలోనే విశాఖపట్నం నగరానికి అనుబంధంగా కొత్త ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని చంద్రబాబు సూచించారు.అప్పట్లో హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ ఐటీ రంగంలో నిలబెట్టడానికి హైటెక్ సిటీ ఒక పునాదిగా నిలిచింది. ఇప్పుడు విశాఖపట్నం నగరాన్ని బహుళ రంగాల ఆర్థిక కేంద్రంగా తీర్చి దిద్దడానికి బే సిటీ ఒక కీలక ప్రాజెక్టుగా నిలవబోతోంది. విశాఖపట్నం ఎకనామిక్ రివిజన్ పరిధిలో మొత్తం 167 ప్రాజెక్టులను గుర్తించారు. వీటిలో ఇప్పటికే 64 ప్రాజెక్టులు అమలు దశలో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం సిటీ ఎకనామిక్ రీజియన్ పథకం ద్వారా 9,180 కోట్లతో 60 ప్రాజెక్టులకు సంబంధించిన ప్రతిపాదనలను ముందుకు తీసుకువెళ్లడానికి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.

బీఆర్ఎస్ కి రాజకీయ సిద్ధి...అక్కడే రేవంత్ గురి !



సిద్ధిపేట. కేసీఆర్ కుటుంబానికి రాజకీయ సిద్ధిని ప్రసాదించిన ప్రాంతం. కేసీఆర్ 1983లో తొలిసారి పోటీ చేసి ఓటమి చెందినా 1985 నుంచి కల్వకుంట్ల కుటుంబానికి అడ్డాగా మారిన సీటు అది. కేసీఆర్ అయితే 1985, 1989, 1994, 1999, 2001, 2004 లలో వరసగా గెలిచారు. ఇక 2004 లో ఆయన ఎంపీగా పోటీ చేయడంతో సిద్ధిపేట నుంచి ఉప ఎన్నికల్లో ఆయన మేనల్లుడు హరీష్ రావు తొలిసారి పోటీ చేసి గెలిచారు. ఇక మధ్యలో ఒక ఉప ఎన్నికతో పాటు 2009, 2014, 2018, 2023లలో ఆయన వరసగా గెలిచారు. ఈ విధంగా చూసుకుంటే మామకు సరిసాటిగా మేనల్లుడు హరీష్ రావు కూడా ఆరు సార్లు గెలిచి సత్తా చాటారు అన్న మాట. 1985 నుంచి 2028 దాకా లెక్కిస్తే ఏకంగా 43 ఏళ్ల పాటు కేసీఆర్ కుటుంబం ఆధీనంలోనే సిద్ధిపేట ఉండిపోయింది. అక్కడ ఆ ఫ్యామిలీకి తిరుగులేదని అనేక సార్లు నిరూపితం అయింది. ఒక విధంగా కంచుకోటగా ఉంది.

రేవంత్ రీసౌండ్ :

అలాంటి సిద్ధిపేటలో ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి తాజాగా పర్యటించి పొలిటికల్ గా రీ సౌండ్ చేశారు అని అంటున్నారు. సిద్ధిపేటలో కాంగ్రెస్ ని గెలిపించి చూపిస్తామని ఆయన గట్టిగానే చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా కాంగ్రెస్ జెండా ఎగరేస్తాని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అంతే కాదు సిద్ధిపేట నుంచి గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇస్తామని ఆయన ప్రకటించారు. దీని అర్థం ఎటూ తెలంగాణాలో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుంది కాబట్టి మంత్రి పదవిని ముందే ఆఫర్ చేసి మరీ కాంగ్రెస్ ని గెలిపించాలని జనాలను రేవంత్ కోరారు అన్న మాట.

మదన్ మోహన్ ని తలచుకుని :

ఇదిల ఉంటే ఈ తరానికి తెలియదు కానీ 1983లో టీడీపీ నుంచి పోటీ చేసిన కేసీఆర్‌ను ఓడించిన కాంగ్రెస్ సీనియర్ నేత మాజీ ఎమ్మెల్యే అనంతుల మదన్ మోహన్ అని గట్టి నాయకుడు అక్కడ ఉండేవారు. ఆయన తరువాత మళ్లీ కాంగ్రెస్ జెండా సిద్ధిపేటలో ఎగరలేదు. దాంతో రేవంత్ రెడ్డి అంతా మరచిన మదన్ మోహన్ ని సిద్ధిపేట సభలో తలచుకున్నారు. మదన్ మోహన్ పేరును సిద్ధిపేట మెడికల్ కాలేజీకి పెట్టాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఆదేశాలు ఇస్తున్నట్లుగా ముఖ్యమంత్రి అక్కడికక్కడే ప్రకటించారు. అంతే కాదు సిద్ధిపేట కాంగ్రెస్ కి బలమైన స్థావరం అని అన్నారు. సీఎం సభకు పెద్ద ఎత్తున తరలి వచ్చిన జనాలను చూసిన రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ ని గట్టిగానే టార్గెట్ చేశారు. కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్ లక్ష్యంగా ఆయన పదునైన విమర్శలు గుప్పించారు.

జనాలు ఆలోచించేలా :

ఎంతకాలం ఒకే కుటుంబం ఒకే రాజకీయం అంటూ జనాలలో ఆలోచనలు తట్టిలేపేలా రేవంత్ రెడ్డి పవర్ ఫుల్ గానే స్పీచ్ ఇచ్చారు. అదే సమయంలో వారసత్వ రాజకీయాలు అంటూ బీఆర్ఎస్ ని గట్టిగా టార్గెట్ చేశారు. మామ కాకపోతే అల్లుడు వస్తారు ఎంత కాలం వారేనా అని ప్రశ్నించారు. అంతే కాదు కాళేశ్వరం ప్రాజెక్టు, ఫామ్ హౌస్‌లు, ఆస్తుల వ్యవహారాలపై బీఆర్ఎస్ కి ప్రశ్నలు వరసగా సంధించారు. ఒక విధంగా బీఆర్ఎస్ కంచుకోటనే టార్గెట్ చేయడం ద్వారా కుంభ స్థలానికే రేవంత్ రెడ్డి గురి పెట్టారు అని అంటున్నారు. సిద్ధిపేట ఒక అసెంబ్లీ సీటు మాత్రమే కాదు, కేసీఆర్ రాజకీయ ప్రస్థానానికి తొలి అడుగు, ఆయన టీఆర్ఎస్ స్థాపించినపుడు టీడీపీకి రాజీనామా చేసి ఒక్కడిగా బయటకు వచ్చినపుడు ఉప ఎన్నికల్లో గెలిపించి అండగా నిలిచింది. అంతే కాదు ప్రభుత్వాలను సవాల్ చేసి ఉప ఎన్నికలు తెచ్చినప్పుడల్లా గులాబీ జెండాను పట్టింది. వైఎస్సార్ హయాంలో కూడా సిద్ధిపేట బీఆర్ఎస్ దే అయింది. మరి అలాంటి కంచుకోటను రేవంత్ రెడ్డి ఇపుడు టార్గెట్ చేయడం ద్వారా బీఆర్ఎస్ కి భారీ సవాల్ నే విసిరారు అంటున్నారు.

వైభవంగా శ్రీశైలంలో కోటి దీపోత్సవం



నంద్యాల,నంద్యాల జిల్లాలోని శ్రీశైల క్షేత్రంలో కొలువైన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం కోటి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేవస్థాన ఆగమ పాఠశాల ముందుభాగంలోని మైదానంలో సాయంత్రం 6 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందుకోసం కైలాస పర్వత నమూనాలో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి అత్యంత వైభవంగా దీపోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అవసరమైన పూజా ద్రవ్యాలన్నింటినీ దేవస్థానమే సమకూర్చింది. సాయంత్రం 4.30 గంటలకు ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త డా. దీవి హయగ్రీవాచార్యులు కోటి దీపోత్సవ విశేషాలను భక్తులకు వివరించారు. అనంతరం సంప్రదాయ నృత్య కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక వేదికపై శ్రీ స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేష పూజలు చేసి కోటి దీపోత్సవాన్ని జరిపించారు.అనంతరం శ్రీ స్వామి, అమ్మవార్లకు ఓంకార హారతి, నాగ హారతి, త్రిశూల హారతి, నంది హారతి, సింహ హారతి, సూర్య హారతి, చంద్ర హారతి, కుంభ హారతి, నక్షత్ర హారతి, కర్పూర హారతి కలిపి దశవిధ హారతులు సమర్పించారు. వీటి అనంతరం ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు మనో బృందంతో భక్తి సంగీత స్వరార్చన కార్యక్రమం నిర్వహించారు. చివరగా మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, ఆశీర్వచనంతో కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని ముగించారు. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వైదిక సంప్రదాయంలో దీపానికి ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. దీపజ్యోతిని యజ్ఞాగ్నికి సంకేతంగా భావించడం మన సంప్రదాయమని తెలిపారు. అందుకే సంప్రదాయబద్ధంగా, శ్రీ స్వామి, అమ్మవార్ల కైంకర్యంగా కోటి దీపోత్సవాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జ్ఞానం, వెలుగు, ఉత్సాహం, ఆనందం, శాంతికి దీపం ప్రతీకగా నిలుస్తుందని, దీపారాధనతో ఈ దివ్యగుణాలను పొందవచ్చని పండితులు చెబుతున్నారని వివరించారు. పరమేశ్వరునికి దీపజ్యోతిని సమర్పించడం ద్వారా సక